WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

# నవతరం

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్, రాజమండ్రి సంపుటి : 11 సంచిక : 274 సోమవారం 02-2-2026 పేజీలు : 8 వెల : 5-00

### మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాతే..

## చైర్మన్, మేయర్ అభ్యర్థుల ప్రకటన



**హైదరాబాద్, నవతరం**

మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాతే.. చైర్మన్, మేయర్ అభ్యర్థుల ప్రకటన

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల హడావిడి మొదలైంది. ఈ నేపథ్యంలో పురపాలక చైర్మన్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థుల ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాతే చైర్మన్,

మేయర్ అభ్యర్థులను ప్రకటించాలని నాయకులను ఆదేశించారు. ఎన్నికలకు ముందే పేర్లు ప్రకటిస్తే పార్టీ ఇబ్బందుల్లో పడే ఛాన్స్ ఉందని సీఎం హెచ్చరించారు. చాలా మంది నాయకులు ఈ పదవుల కోసం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## తెలంగాణ కు గుండు సున్నానే



- 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా తెలంగాణకు తీరని అన్యాయం
- 12 ఏళ్లుగా తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ సర్కార్
- విభజన హామీలు సహా తెలంగాణకు రావాల్సిన నిధులపై కిక్కురుమనని ఆర్థిక మంత్రి
- మోడీ నిత్యం వల్లవేసే కో-ఆపరేటివ్ ఫెడరలిజం అంటే ఇదేనా?
- కేంద్ర బడ్జెట్ పై తెలంగాణ జాగృతి

### సిగరెట్లు, పాన్ మసాలా ప్రియం:

## నేటి నుంచే కొత్త పన్నులు

- సిగరెట్ పొడవును బట్టి అదనపు ఎక్సైజ్ డ్యూటీ
- పాన్ మసాలాపై కొత్తగా 'హెల్త్ అండ్ నేషనల్ సెక్యూరిటీ సెస్' ఈ-సిగరెట్లు, నికోటిన్
- ఉత్పత్తులపై 100 శాతం పన్ను
- అక్రమ రవాణా పెరుగుతుందనే ఆందోళనలో నిపుణులు



## ముగిసిన కేసీఆర్ సిట్ విచారణ



- తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ
- ఫోన్ ట్యాపింగ్ కేసుపై సిట్ సమగ్ర దర్యాప్తు.
- సిట్ సుమారు నాలుగున్నర గంటలకు పైగా విచారణ
- ఆ ఆధారాలతో విచారించిన సిట్..
బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు
- అంశంపై ఆడియోలు ఎలా వచ్చాయనే అంశంపై సిట్ సుదీర్ఘంగా విచారణ

హైదరాబాద్, **నవతరం**

తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఉత్కంఠ రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కీలక దశకు చేరుకుంది. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ను ప్రత్యేక దర్యాప్తు బృందం ఈరోజు(ఆదివారం) సుదీర్ఘంగా విచారించింది.

హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమైన ఈ విచారణలో కేసీఆర్‌కు సిట్ అధికారులు పలు ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. కేసీఆర్‌ను నాలుగున్నర గంటలకుపైగా సిట్ అధికారులు ప్రశ్నించారు.నందినగర్ నివాసంలో కేసీఆర్‌ను ఆరుగురు అధికారుల బృందం ప్రశ్నించింది. గతంలో సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా కేసీఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించారు. కేసీఆర్ ఎదుట అందుకు సంబంధించిన ఆధారాలు ఉంచి ప్రశ్నించారు.

మిగతా 2లో


## కేంద్ర బడ్జెట్‌పై విపక్షాల ఫైర్..



- వాస్తవాలను విస్మరించారన్న రాహుల్
- నిరుద్యోగం, రైతుల కష్టాలను ప్రభుత్వం విస్మరించిందని రాహుల్ ఆరోపణ
- స్టాక్ మార్కెట్ పతనానికి బడ్జెట్టే కారణమన్న అఖిలేశ్ యాదవ్
- ఇది కేవలం 5 శాతం మంది ప్రజల కోసమేనని విమర్శ
- మధ్యతరగతి, రైతులు, కార్మికులకు తీవ్ర నిరాశే మిగిలిందని వ్యాఖ్య

### కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్


## ఫార్వార్డ్ లుకింగ్ బడ్జెట్...



- కేంద్ర బడ్జెట్ ను స్వాగతిస్తున్నాను...
- ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను అభినందిస్తున్నాను
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

# పనిచేసే వారికి పట్టం..
# మారకుంటే నమస్కారం..

- కుప్పం నుంచి చంద్రబాబు స్ట్రాంగ్ మెసేజ్
- కుప్పంలో కార్యకర్తలతో చంద్రబాబు సమావేశం
- నిజంగా కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని భరోసా
- పనితీరు బాగోకపోతే నిర్మొహమాటంగా పక్కన పెడతానని హెచ్చరిక
- కుప్పం మోడల్‌నే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- ఒకే సీజన్‌లో కుప్పానికి హంద్రీ-నీవా జలాలు తెచ్చామని వెల్లడి
- రాయలసీమను రతనాల సీమగా మార్చి చూపించామని వ్యాఖ్య



మిగతా 2లో

**కుప్పం,నవతరం**

ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన సొంత నియోజకవర్గం కుప్పంపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. కుప్పంలో ఆదివారం నాడు నియోజకవర్గ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించి, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను వెతుక్కుని వచ్చి గౌరవిస్తానని భరోసా ఇస్తూనే, పనితీరు మార్చుకోని నేతలకు గట్టి హెచ్చరికలు పంపారు. ఇదే సమావేశంలో, నాడు నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర మూడేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా రూపొందించిన ప్రత్యేక గీతాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారికి ఉన్నత పదవులు వాటంతట అవే వస్తాయని అన్నారు. "ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టకున్నా పార్టీ జెండా మోసిన షణ్ముఖ రెడ్డికి చిత్తూరు పార్లమెంట్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడమే ఇందుకు నిదర్శనం. నిన్నటి వరకు సామాన్య కార్యకర్తగా ఉన్న ఆయన, ఈరోజు పార్లమెంట్ అధ్యక్షుడయ్యారు. ఇదే తెలుగుదేశం పార్టీలో ఉండే గుర్తింపు" అని పేర్కొన్నారు. తన కష్టాన్ని గుర్తించినందుకు షణ్ముఖ రెడ్డి భావోద్వేగానికి గురై అధినాయకత్వానికి కృతజ్ఞతలు

# పనిచేసే వారికి పట్టం.. మారకుంటే నమస్కారం..





తెలిపారు. ఎన్ని సంక్షోభాలు ఎదురైనా టీడీపీ నిలదొక్కుకోగలిగిందని, అందుకే ప్రజలు చరిత్రలో ఎన్నడూ లేనంతటి మెజారిటీని కూటమికి కట్టబెట్టారని చంద్రబాబు అన్నారు. వైసీపీ కనీసం ప్రతిపక్ష హోదాకు దరిదాపుల్లోకి కూడా రాలేకపోయిందని, ప్రజలతో మమేకమైతేనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. “నా రాజకీయ జీవితం 2028 నాటికి 50 ఏళ్లకు చేరుకుంటుంది. ప్రజల భవిష్యత్, వారి సంక్షేమం కోసమే నా ప్రతి ఆలోచన ఉంటుంది” అని తెలిపారు.

కుప్పం నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడుతూ, ఒకే సీజన్‌లో హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొచ్చామని, లేదంటే ఈ ప్రాంతం తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనేదని గుర్తుచేశారు. “రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పాం.. చేసి చూపించాం. దేశంలోనే ఉద్యాన ఉత్పత్తుల్లో రాయలసీమ అగ్రస్థానంలో ఉంది. దీనిని మరింత అభివృద్ధి చేస్తాం” అని హామీ ఇచ్చారు. అమరావతి వంటి నగరాలు దేశానికి అవసరమని ఆర్థిక సర్వే కూడా చెప్పిందని గుర్తుచేశారు. తన పాలనా శైలిని వివరిస్తూ, “నేను నిర్మొహమాటంగా మాట్లాడతా, వాస్తవాలు చెబుతా. తప్పులు సరిచేసుకోమని సూచిస్తా. అప్పటికీ పనితీరు మార్చుకోకపోతే నమస్కారం పెట్టి పక్కన పెడతాను” అని గట్టిగా హెచ్చరించారు. ప్రతి వారం ఎమ్మెల్యేల పనితీరును సమీక్షిస్తున్నానని, కార్యకర్తలకు, తనకు మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా టెక్నాలజీని వినియోగిస్తున్నామని చెప్పారు. కూటమిలోని మిత్రపక్షాలతో కలిసి పనిచేయాలని, సంక్షేమ పథకాల అమలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. కుప్పంలోని 150 చెరువులను నింపినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించాలని కోరారు.

# ముగిసిన కేసీఆర్ సిట్ విచారణ

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు అంశంపై ఆడియోలు ఎలా వచ్చాయనే అంశంపై సిట్ సుదీర్ఘంగా విచారణ చేపట్టింది. ఈ కేసు విచారణని ముగించుకున్న అనంతరం కేసీఆర్ నివాసం నుంచి సిట్ అధికారులు వెళ్లిపోయారు

. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఎవరి సూచనలతో జారీ అయ్యాయనే విషయంపై, నిర్ణయ ప్రక్రియలో కేసీఆర్ పాత్రపై సిట్ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

### ఫోన్ ట్యాపింగ్ ఎప్పటినుంచి మొదలైంది..

ఫోన్ ట్యాపింగ్ చేయమని ఆదేశాలు జారీ చేశారా..? అని కేసీఆర్‌ని నేరుగా ప్రశ్నించారు. ‘ఫోన్ ట్యాపింగ్ చేయమని ఇంటెలిజెన్స్ అధికారులకు మీరు స్వయంగా ఆదేశాలు జారీ చేశారా?’ అనే ప్రశ్నను స్పష్టంగా అడిగినట్లు సమాచారం. ఈ అంశంపై కేసీఆర్ నుంచి క్లారిటీ తీసుకునేందుకు సిట్ అధికారులు తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలిసింది. ఏ సంవత్సరం నుంచి ఫోన్ ట్యాపింగ్ మొదలైంది..? అనే విషయాలపై సిట్ అధికారులు ప్రత్యేకంగా ఆరా తీశారు.

### వారి ఫోన్లు ట్యాప్ చేశారా..?

‘ఏ సంవత్సరం నుంచి ఫోన్ ట్యాపింగ్ చేయమని చెప్పారు?, అది సాధారణ భద్రత కోసమా..? లేక రాజకీయ అవసరాల కోసమా..?’ అంటూ పలు ప్రశ్నలు వేసినట్లు సమాచారం. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేశారా..?.. వారి ఫోన్లు ట్యాప్ చేయమని ఆదేశాలు ఇచ్చారా..? అంటూ సిట్ అధికారులు నేరుగా ప్రశ్నించారని సమాచారం. ఈ ప్రశ్నలపై కేసీఆర్ ఇచ్చిన సమాధానాలు ఈ కేసులో తమ దర్యాప్తునకు కీలకంగా మారనున్నాయని సిట్ అధికారులు భావిస్తున్నారు.

### ప్రభాకర్‌రావు పదవీకాలంపై విచారణ..

ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు వ్యవహారం కూడా సిట్ అధికారుల విచారణలో ప్రధాన అంశంగా మారింది.




పదవీకాలం ముగిసిన ప్రభాకర్‌రావుకు మళ్లీ పదవిని ఎందుకు పొడిగించారు..? ఆ నిర్ణయం వెనుక కారణాలు ఏంటి..? అంటూ కేసీఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఒకే వ్యక్తికి రెండు కీలక పోస్టులు ఎందుకు..?, పరిపాలనా నియమావళికి విరుద్ధంగా ఒకే వ్యక్తికి రెండు కీలక బాధ్యతలు అప్పగించడంపై కూడా సిట్ అధికారులు ప్రశ్నలు సంధించారు. ఒకే వ్యక్తికి రెండు కీలక పోస్టులు ఎందుకు అప్పగించారు..?, అది ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో సంబంధం ఉందా..? అనే కోణంలో సిట్ విచారణ కొనసాగినట్లు సమాచారం.

### ఎమ్మెల్యేల కొనుగోలు కేసుపై..

ఎమ్మెల్యేల కొనుగోలు కేసు సమయంలో తీసుకున్న చర్యలపై కూడా సిట్ అధికారులు ప్రశ్నించారు. ‘మీ పార్టీ ఎమ్మెల్యేలు ఇతర పార్టీలకు వెళ్తున్నారని మీకు ఎలా తెలిసింది?, ఆ సమాచారం ఫోన్ ట్యాపింగ్ ద్వారానే వచ్చిందా..? అనే అనుమానాలతో అధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది. పార్టీ ఫండ్‌తో ఫోన్ ట్యాపింగ్ పరికరాల కొనుగోలు..? చేశారా అని సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ విచారణలో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. ఫోన్ ట్యాపింగ్ పరికరాల కొనుగోలుకు పార్టీ ఫండ్‌ను కేటాయించారా..? ప్రభుత్వ నిధులు కాకుండా పార్టీ డబ్బులు ఎందుకు ఉపయోగించారు..? అంటూ సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం.

# తెలంగాణ కు గుండు సున్నానే



హైదరాబాద్, నవతరం: వరుసగా 12వ ఏడాది కేంద్రంలోని బీజేపీ సర్కారు తెలంగాణకు గుండు సున్నానే దక్కిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్ పై ఎక్స్ వేదిక స్పందించారు. పన్నెండేళ్లుగా తెలంగాణను మోసం చేయటం బీజేపీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై ఆమె ట్వీట్ చేశారు. కో-ఆపరేటివ్ ఫెడరలిజం అంటూ ప్రధాని మోడీ నిత్యం చెబుతుంటారు కానీ ఆచరణలో మాత్రం పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విభజన హామీలు సహా తెలంగాణ ప్రాజెక్ట్ లకు రావాల్సిన నిధులన్నింటినీ పెండింగ్ లో పెట్టారని విచారం వ్యక్తం చేశారు. స్థిరత్వం, క్రమశిక్షణ, వృద్ధి అంటూ నినాదాలు చెప్పే బీజేపీ పెద్దలు ఎందుకు తెలంగాణ విషయంలో వివక్ష చూపుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు.

8 మంది ఎంపీలను ఇస్తే తిరిగి ఇచ్చింది గుండుసున్నా

తెలంగాణ నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలను ఇస్తే రాష్ట్రానికి మాత్రం గుండుసున్నా ఇచ్చారని మండిపడ్డారు. రాష్ట్రానికి నిధులు రావాల్సిన దానికి బదులు పెండింగ్ ఫైల్స్ వస్తున్నాయన్నారు. 34 వేల 367 కోట్ల తో చేపట్టాల్సిన రీజినల్ రింగ్ రోడ్, హైవేలు, రేడియల్ రోడ్లకు నిధులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో ఫేజ్ 2 విస్తరణకు ఇవ్వాల్సిన 50 శాతం నిధులు ఇవ్వలేదన్నారు. కొత్త రైల్వే లైన్స్ కు క్లియరెన్స్ లు ఇవ్వకపోగా, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీని అటకెక్కించారని మండిపడ్డారు. తెలంగాణకు దక్కాల్సిన ఐఐఎం, 16 నవోదయ విద్యాలయాలు, 9 కేంద్రీయ విద్యాలయాలను ఇవ్వటం లేదన్నారు. విభజన చట్టం హామీలైన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా పారిశ్రామిక ప్రోత్సహకాలు ఏమీ ఇవ్వలేదన్నారు. ఇలా చెప్పుకుంటే పోతే తెలంగాణకు బీజేపీ చేసిన అన్యాయాల జాబితా చాంతాడంతా ఉందన్నారు. ప్రధాని మోడీ చెప్పే కో ఆపరేటివ్ ఫెడరలిజం అంటే తెలంగాణ ప్రయోజనాలను కాలరాయమటేనా అని ప్రశ్నించారు.

# కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఫార్వార్డ్ లుకింగ్ బడ్జెట్...

తాడేపల్లి,:కేంద్ర బడ్జెట్ పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు,రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన అంశాల్లో మరింతగా దూకుడుగా వెళ్లేందుకు ఈ బడ్జెట్టు సహకరించేలా ఉందన్నారురాష్ట్రం అమలు చేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విదానానికి ఈ బడ్జెట్ మరింత సహకరించేలా ఉందన్నారు,రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఎంఎస్ఎంఈలపై ఎక్కువగా దృష్టి సారించింది... వీటిని మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉందన్నారు,మహిళలు, రైతులు, యువత సాధికారిత సాధించేలా బడ్జెట్ ఉందన్నారు,2047 వికసిత్ భారత్ డెవలప్డ్ ఎకానమీగా మారేందుకు ఇది ఉపయోగపడుతుందనీ హర్షం వ్యక్తం చేశారు,

ఆర్ధిక మంత్రి బ్యాలెన్స్ బడ్జెట్ ప్రవేశపెట్టారు,దిశ అండ్ గతి ఉపకరిచేలా బడ్జెట్ ఉందన్నారు,ఏఐ సహా వివిధ టెక్నాలజీలు, నెక్స్ట్ లెవల్ ఆఫ్ రిఫార్మ్స్ కు వెళ్తుందన్నారు,రెన్యువబుల్ ఎనర్జీ, వన్ గ్రిడ్ నేషన్ దిశగా బడ్జెట్ ఉందన్నారు,స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించారు.మెరుగైన జీవన ప్రమాణాలు, ఈజ్ ఆఫ్ లివింగ్ కోసం దోహదం చేసేలా బడ్జెట్ ఉందన్నారు,హైదరాబాద్-బెంగుళూరు, హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ ద్వారా రాష్ట్రానికి ఉపయోగం ఉందన్నారు,తిరుపతి, అమరావతి వంటి ప్రాంతాలు ఈ హైస్పీడ్ కారిడార్లల్లో కవర్ అవుతాయన్నారు,బెంగుళూరు- చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ వల్ల పలమనేరు, చిత్తూరు, తదితర ప్రాంతాలు కవర్ అవుతాయన్నారు,ఈ మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు ఏపీలోని వివిధ ప్రాంతాలను కవర్ చేస్తాయన్నారు,హైదరాబాద్, అమరావతి, బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలు అన్ని అనుసంధానం అవుతాయన్నారు,డెడికేటెడ్ రేర్ ఎర్త్ కారిడార్లో ఏపీ కూడా ఉందన్నారు,

అత్యంత విలువైన భార ఖనిజాలు వెలికి తీసి క్రిటికల్ ఎలక్ట్రానిక్స్ తయారీకి ఉపకరించే అవకాశం ఉందన్నారు, ఐఎస్ఎం 2.0 ద్వారా సెమీ కండక్టర్ కు రూ.40 వేల కోట్లు పెట్టారన్నారు,టెక్స్ టైల్ సెక్టార్ కు కూడా ఊతమిచ్చారు. మన రాష్ట్రానికి ఈ అంశం చాలా ఉపకరిస్తుందన్నారు, పర్యాటకానికి, హాస్పిటాలిటికి కూడా ప్రాధాన్యం ఇచ్చారు,

మన రాష్ట్రంలో అరకులో టూరిజం పెరగడానికి దోహదం చేస్తుందన్నారు,కోకోనట్, జీడి, కోకో, చందనం లాంటి పంటలకు ఊతమిచ్చేలా చర్యలు ఉన్నాయన్నారు,డేటా సెంటర్లకు పన్ను మినహాయింపులు 2047 వరకూ పెట్టారన్నారు,భారత్ డేటా సెంటర్ల హబ్ గా తయారవుతుందన్నారు,విశాఖకు గూగుల్ సహా వివిధ డేటా సెంటర్లు వస్తున్నాయన్నారు,ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కు ఊతమిచ్చేలా ఈ డేటా సెంటర్లు తయారవుతా యన్నారు,పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి,లాజిస్టిక్స్ రంగానికి ఏపీ పూర్తి స్థాయిలో దృష్టి సారించింది,కేంద్ర బడ్జెట్టులో తొలిసారిగా లాజిస్టిక్స్ రంగం అభివృద్ధి గురించి ప్రస్తావించారు.

# సిగరెట్లు, పాన్ మసాలా ప్రియం

## నేటి నుంచే కొత్త పన్నులు

దేశంలో ‘సిన్ గూడ్స్’గా పిలిచే పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం కొత్త పన్నుల నియమావళిని అమల్లోకి తెచ్చింది. ఇప్పటివరకు ఉన్న 28 శాతం జీఎస్‌టీ ప్లస్ కాంపెన్సేషన్ సెస్ స్థానంలో.. ఇప్పుడు 40 శాతం జీఎస్‌టీతో పాటు అదనపు ఎక్సైజ్ డ్యూటీ, హెల్త్ సెస్ విధిస్తున్నారు. దీనివల్ల సిగరెట్ల ధరలు 15 నుంచి 40 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది.సిగరెట్ పొడవు, ఫిల్టర్ రకాన్ని బట్టి పన్నులను ఖరారు చేశారు, 65 మి.మీ లోపు (నాన్-ఫిల్టర్) ఒక్కో సిగరెట్‌పై రూ. 2.05 అదనపు డ్యూటీ, 65 మి.మీ లోపు (ఫిల్టర్) ఒక్కో సిగరెట్‌పై రూ. 2.10 అదనపు డ్యూటీ, మీడియం (65-70 మి.మీ) ఒక్కో స్టిక్‌పై సుమారు రూ. 4 వరకు పెంచారు. అలాగే, ప్రీమియం/లాంగ్ (70-75 మి.మీ) ఒక్కో స్టిక్‌పై రూ. 5.40 వరకు భారం పడనుంది. కొన్ని కేటగిరీల్లో 1000 సిగరెట్లపై రూ. 8,500 నుంచి రూ. 11,000 వరకు ఎక్సైజ్ డ్యూటీ పడనుంది.పాన్ మసాలా, గుట్కా తయారీదారులు ఇకపై తమ ప్యాకింగ్ మెషీన్ల సామర్థ్యం ఆధారంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది.




అంతేకాకుండా, తయారీ కేంద్రాల్లో తప్పనిసరిగా జజుఎ కెమెరాలు, ఏర్పాటు చేసి ఆ ఫుటేజీని 24 నెలల పాటు భద్రపరచాలని ప్రభుత్వం ఆదేశించింది. పచ్చి పొగాకుపై 60-70 శాతం, ఈ-సిగరెట్లపై 100 శాతం పన్ను విధించడం ద్వారా ప్రభుత్వం తన కఠిన వైఖరిని స్పష్టం చేసింది.ధరలు పెంచడం ద్వారా ప్రజలు ధూమపానానికి దూరమవుతారని ప్రభుత్వం భావిస్తుండగా, నిపుణులు మాత్రం భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. పన్నులు మరీ ఎక్కువగా ఉంటే, ప్రజలు చౌకగా దొరికే స్మగ్లింగ్ సిగరెట్లు లేదా నకిలీ ఉత్పత్తుల వైపు మళ్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, ప్రజల ఆరోగ్యం మరింత దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కేంద్ర బడ్జెట్‌పై విపక్షాల ఫైర్..



న్యూఢిల్లీ, లేపాక్షి టైమ్స్:

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌పై విపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. దేశం ఎదుర్కొంటున్న వాస్తవ ఆర్థిక, సామాజిక సవాళ్లను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరుద్యోగం, తయారీ రంగం క్షీణత, రైతుల కష్టాలు వంటి కీలక సమస్యలను పరిష్కరించడంలో ఈ బడ్జెట్ ఘోరంగా విఫలమైందని ఆయన ఆదివారం విమర్శించారు.

ఈ మేరకు ‘ఎక్స్’ వేదికగా రాహుల్ గాంధీ స్పందించారు. “ఉద్యోగాలు లేని యువత, పడిపోతున్న తయారీ రంగం, దేశం నుంచి తరలిపోతున్న పెట్టుబడులు,కుప్పకూలుతున్న కుటుంబ పొదుపు, రైతుల కష్టాలు, పొంచివున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభాలు... వీటన్నింటినీ బడ్జెట్ పట్టించుకోలేదు. దిద్దుబాటు చర్యలకు నిరాకరిస్తున్న ఈ బడ్జెట్, భారతదేశ వాస్తవ సంక్షోభాల పట్ల గుడ్డిగా వ్యవహరిస్తోంది” అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. రాహుల్‌తో పాటు ఇతర విపక్ష నేతలు కూడా బడ్జెట్‌పై పెదవివిరిచారు. వృద్ధిని పునరుద్ధరించడానికి, ఉపాధి కల్పించడానికి ఇందులో సరైన సంస్కరణలు లేవని విమర్శించారు, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మరో అడుగు ముందుకేసి, స్టాక్ మార్కెట్ పతనానికి బడ్జెట్టే కారణమని ఆరోపించారు. “బీజేపీ బడ్జెట్ ఫలితం ఇదిగో.. షేర్ మార్కెట్ భారీగా కుప్పకూలింది. ఆదివారం మార్కెట్ తెరుస్తారా లేదా అన్నది ప్రశ్న కాదు, అది ఇంకా ఎంత పడిపోతుందన్నదే అసలు ప్రశ్న అని మేము ముందే చెప్పాం” అని ఆయన అన్నారు. ఈ బడ్జెట్ కేవలం 5 శాతం మంది ప్రజల కోసమేనని, కమీషన్లు దక్కించు కోవడానికి, బీజేపీ సొంత వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చడానికే దీన్ని రూపొందించారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. “ఇది బీజేపీ తరహా అవినీతికి కంటికి కనిపించని లెక్కల చిట్టా” అని అఖిలేష్ అభివర్ణించారు. అనియంత్రితంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం సమయంలో పన్ను ఉపశమనం కల్పించకపోవడం ‘పన్ను దోపిడీ’ కిందకే వస్తుందని ఆయన విమర్శించారు. సంపన్నులకు వ్యాపారం, ప్రయాణాల కోసం పదుల రకాల మినహాయింపులు ఇచ్చి, నిరుద్యోగులకు మాత్రం ‘ఆశల ఖాళీ పళ్లెం’ చూపించారని ఎద్దేవా చేశారు


. ఈ బడ్జెట్ వల్ల మధ్యతరగతి ప్రజలు పూర్తిగా మోసపోయినట్లు భావిస్తున్నారని, పేదలు మరింతగా కుంగిపోతున్నారని అన్నారు. రైతులు, కార్మికులు, చిరు వ్యాపారులు టెలిస్కోప్‌తో వెతికినా తమ కోసం ఇందులో ఏమీ కనిపించలేదని, ఇది తీవ్ర నిరాశాజనకమైన, దారుణమైన బడ్జెట్ అని అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు.

# శ్రీనివాస్ నగర్లో 'జీరో బిల్డింగ్ నిర్మాణం'


- ముప్పై మూడు గజాలకు టాక్స్ చెల్లింపులు
- 84 గజాల్లో నిర్మాణానికి సన్నాహాలు, నిర్మాణం
- హై టెన్షన్ కరెంటు తీగలకింద ఆక్రమణ
- రహస్యంగా లక్షల రూపాయలు దండుకున్న నకిలీ నాయకులు
- చర్యలు తీసుకోవాలంటున్న కాలనీ ప్రజలు


కుత్బుల్లాపూర్, నవతరం: చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు చేయాల్సినవారే సైలెంట్ గా ఉంటున్నారు. ఏదో ఒక నోటరీ పత్రం చూపించి నిర్మాణానికి తెరలేపిన భవన నిర్మాణదారుడు, అందినకాడికి దండుకుంటూ... తమకేమీ తెలియదంటున్నా నకిలీ నాయకులు. ముప్పై గజాల స్థలంలో శెట్టర్ల నిర్మాణం చేపట్టి... అందుకు ప్రభుత్వానికి టాక్స్ చెల్లించిన సదరు నిర్మాణదారుడు ప్రస్తుతం... ఒకసారి డెబ్బై గజాలు అని, మరోసారి 84 గాజాలు అని నిర్మాణానికి తెరలేపి కాలనీ ప్రజలను అయోమయానికి గురిచేస్తూ... కాసింత ప్రభుత్వ భూమిని సైతం కాజేసే పనిలో నిమగ్నమయ్యాడు సదరు భవన నిర్మాణదారుడు అంటూ పలువురు భిన్నభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జగద్గిరిగుట్ట శ్రీనివాస్ నగర్ చివరి బస్టాప్ పక్కనే ఉన్న సదరు భవన నిర్మాణానికి సంబంధించి పలుమార్లు స్థానిక ప్రజలు, కాలనీ నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ సదరు భవన నిర్మాణదారుడు పుట్టింగులు వేసే క్రమంలో తీసిన గుంతలు పూర్తిగా పూడ్చేసి కొద్దిరోజులు అలాగే వదిలేశాడు. అనంతరం స్థానిక నాయకుల వద్దకు సమస్య పరిష్కారం కొరకు తిరిగి పైరవీలు చేసి సక్సెస్ అయినట్టు నిఘావర్గాలు చెబుతున్నాయి. పైరవీలు ఫలించిన తర్వాత మళ్ళీ భవన నిర్మాణానికి గుంతలు తవ్వి... పుట్టింగులతో పెర్మనెంట్ స్ట్రక్చర్ ప్లాన్ చేశాడు. ముప్పై మూడు గజాల కొరకు బల్దియా కు టాక్స్ చెల్లించిన సదరు భవన నిర్మాణదారుడు ఏకంగా 70 గజాలు, 84 గజాలు అంటూ ప్రభుత్వ భూమికి యజమాని ఎలా అయ్యాడు. అప్పుడు ఎందుకు ముప్పై మూడు గజాల్లో నిర్మాణం ఉంచాడు, ఇప్పుడు ఎందుకు అంతకు మించి నిర్మాణానికి తెరాలేపాడు అనే ప్రశ్న అంతుచ్చిక్కకుండా ఉంది. ఏకంగా కొన్ని లక్షలు విలువచేసే ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు టౌన్ ప్లానింగ్ నుండి పొందకుండా... ఓ వైపు ప్రభుత్వ భూమి, మరోవైపు హై టెన్షన్ కరెంటు తీగలు... ఇలా పలు విషయాలతో ముడిపడి వున్న సదరు అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి... తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ, మున్సిపల్ అధికారులను స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. అందుకు సహకరిస్తున్నవారిని గుర్తించాల్సిందిగా కాలనీ కమిటీ నాయకులను స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.










# కెసిఆర్ పై విచారణ నిరసిస్తూ టిఆర్ఎస్ నాయకుల ధర్నా

- తెలంగాణ తెచ్చి, పదేళ్లు అభివృద్ధి చేసిన నేతపై విచారణ
- ఎన్నికల ముందే ఎందుకు విచారించాల్సి వస్తుంది..?
- ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప
- కేసీఆర్ పై విచారణను నిరసిస్తూ బీఆర్ఎస్ ధర్నా



నవతరం, టేక్మాల్: రాజుల కాలంలో కూడా గుడాచారుల వ్యవస్థ ఉండేది.. ఇంటలిజెన్స్ సంస్థలు ఎప్పుడైనా అసాంఘిక శక్తుల ఫోన్లను ట్యాపింగ్ చేయడం సర్వసాధారణం.. దానికి ప్రభుత్వంతో ఎటువంటి సంబంధం ఉండదు.. కానీ ఆనాటి మా ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని, మాజీ ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ఆయన కుటుంబాన్ని టార్గెట్ చేసి అరెస్ట్ చేసేందుకు విచారణ పేరిట కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భక్తుల భక్తుల వీరప్ప ఆరోపించారు. కెసిఆర్ పై సిట్ విచారణను నిరసిస్తూ ఆదివారం మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో చౌరస్తా వద్ద బొడ్మట్ పల్లి మెదక్ రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలదకు ముందు 420 హామీలు ఇచ్చి అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సింది పోయి ప్రతిపక్షాలను టార్గెట్ చేసి డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా కొలువుత్తిన రేవంత్ రెడ్డి రాష్ట్రానికి ఏం చేయాలి.. ఎలాంటి పథకాలు తేవాలి.. ఎలా అభివృద్ధి చేయాలి అన్నది పక్కనపెట్టి ప్రతిపక్షాలను ఎలా టార్గెట్ చేయాలి.. అని ఆలోచిస్తూ కూర్చున్నారని ఎద్దేవా చేశారు. ఉద్యమం ద్వారా తెలంగాణను తీసుకువచ్చి పదేళ్లపాటు ఎన్నో సంక్షేమ కార్యక్రమాల ద్వారా తెలంగాణ అభ్యున్నతికి పాటుపడిన కేసీఆర్ ను విచారించడం ఎన్నికలకు ముందు జరుగుతున్న కుట్రని ఆయన అన్నారు. ఎన్నికల ముందే ఇలా ఎందుకు చేయాల్సి వస్తుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కుట్రను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని అన్నారు. మండల బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు వీరప్ప కు నచ్చచెప్పి పరిస్థితిని శాంతింపజేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మండలంలోని టేక్మాల్ టిఆర్ఎస్ యువనాయకుడు భాస్కర్, సలీం, దుంపగల రాజు, సంతోష్, కాదులూరు గ్రామ మాజీ అధ్యక్షులు యాదయ్య, మరియు, ఆయా గ్రామాల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# టేక్మాల్ లో హటరీర హటరీరీగా కుస్తీ పోటీలు

సర్పంచ్ నిరుడిదాస్



నవతరం, టేక్మాల్: మెదక్ జిల్లా అందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామం తుంబురీశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా అదివారం గ్రామ సర్పంచ్, నిరుడి దాస్, ఉప సర్పంచ్, ఎంపీ సుధాకర్, ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. కోబ్బరికాయ కుస్తీతో మొదలుకొని 5 తులాల వెండి కడేం కుస్తి వరకూ అంగరంగా వైనవంగ కుస్తీ పోటీలు జరిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మల్లయోదులు కుస్తీ పట్టడం జరిగింది. ఈ కుస్తీ పోటీలకు మహారాష్ట్ర కర్ణాటక నాందేడ్ నిజామాబాద్ జహీరాబాద్ మెదక్ తో పాటు వివిధ ప్రాంతాల నుంచి మల్లాయోధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. చివరి కుస్తీ మహారాష్ట్ర డేగ్లూర్ కు చెందిన ఓంకార్ కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం అంతపుర్ గ్రామానికి కు చెందిన గంగాధర్ మల్లయోధుల కుస్తీ హటరీరా హటరీరుగా కొనసాగింది. చివరకు అంతపురంకు చెందిన గంగాధర్ పైల్వాన్ కుస్తీ గెలుపొందాడు. గెలుపొందిన కుస్తీ పైల్వాన్ కు సర్పంచ్ నిరుడి దాస్, ఉప సర్పంచ్, ఎంపీ సుధాకర్ చేతుల మీదుగా పూల మాల వేసి 5 తులాల వెండి కడెం బహూకరించాడు. ఆనంతరం తుంబురీశ్వర స్వామి దర్శించుకుని దివెనలు తీసుకున్నారు. ఈకార్యక్ర˘మంలో వార్డు మెంబర్లు శ్రీహరి, దేవసాయం, చత్రపతి శివాజీ యూత్ సభ్యులు, ప్రవీణ్ పటేల్, వెంకట్,గ్రామ పెద్దలు, రాఘవేంద్రర్, రామ ులు,నర్సింలు, కృష్ణ మూర్తి, రమేష్, రాజు, ముత్యం, మల్లేశం,శ్రీరాములు, రామకృష్ణ, వివిధ గ్రామాల ప్రజలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బొడ్మాట్ పలి చౌరస్తా లో నల్ల బ్యాడ్జిలతో నిరసన

- కెసిఆర్ అక్రమసిట్ కేసులు వేయడం సరికాదు
- టిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు ఈశ్వరప్ప



టేక్మాల్, నవతరం: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కు సిట్ నోటీసులు అక్రమ కేసులు వేయడం వలన నిరసనగా ఈ రోజు అందొల్ నియోజక వర్గం టేక్మాల్ మండల్ బొడ్మట్పల్లి గ్రామ లో నల్లా భార్జీలు బైక్ ర్యాలీ చేయడం జరిగింది. చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల హామీలు ఇచ్చి ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ పై లేనిపోని నిందలు వేయడం సీట్ నోటీసులు ఇవ్వడం కక్ష సాధింపుగా చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని ఈశ్వరప్ప తెలిపారు ఈ కార్యక్రమం లో టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఈశ్వరప్ప పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్

- మందులు అన్ని అందుబాటులో ఉండాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతరం, టేక్మాల్: పీహెచ్సీలలో మందులన్నీ అందుబాటులో ఉండాలి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వైద్య అధికారులకు సూచించారు. మెదక్ జిల్లా టేక్మల్ మండల కేంద్రంలోని పీహెచ్సీనీ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల గదిని, రోగుల రుములను, వైద్యుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఏ మందులు అందుబాటులో ఉన్నాయో అని అడిగారు. డ్యూటీ డాక్టర్ ఎవరు? రాత్రి వేళలో ఎంతమంది వైద్యులు, సిబ్బంది ఉంటున్నారని వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ... అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలని, పరిశుభ్రమైన వాతావరణం లో వైద్యం అందించాలని, వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని వైద్య సిబ్బందినీ ఆదేశించారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛా వాణిజ్యమే బడ్జెట్ లక్ష్యం

ఎగుమతులపై ఆధారపడడం లేదని చెబుతునే అవే లక్ష్యంగా ప్రపంచ మార్కెట్లతో భారత్ ను అను సంధానం చేసే దిశగా బడ్జెట్ రూపొందించినట్లు కేంద్రం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారాం ప్రకటించడం విశేషం. సాంకేతికతను అందిపుచ్చుకుని సంస్కరణ దిశగా దేశాన్ని తీసుకువెళ్లాడమే లక్ష్యం గా పేర్కొన్నారు. ఆదివారం పార్లమెంటులో తొమ్మిదో సారి జాతీయ బడ్జెట్ రూ.53,47,315 కోట్లతో ప్రవేశపెట్టారు.దీనిలో రెవెన్యూ లోటు రూ.5,92,344 కోట్లు గా పేర్కన్నారు. ఈ బడ్జెట్ ద్రవ్యలోటును నియంత్రిస్తుందన్నారు. 7 శాతం గ్రోత్ రేటుతో ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి దిశగా పయనిస్తున్నదన్నార ు.నిర్మాణాత్మక సంస్కరణలతో గ్లోబల్ మార్కెట్ తో పోటీ పడేందుకు భారత్ ను సిద్దం చేస్తామని, 2026-27 కేంద్ర బడ్జెట్ సంస్కరణల బడ్జెట్ గా ఆర్థిక వ ుంత్రి నిర్మలా సీతారాం అభివర్ణించార ు.ప్రజల ఆశలను అందుకోవడమే లక్ష్యంగా రూపొందించినట్లు పేర్కొన్నారు." ాంస్కరణలతో కూడిన మంత్రం" ఇది అని వ్యాఖ్యానించారు .వికసిత్ భారత్ లో యువత ఆకాంక్షలు నెరవేరేందందుకు ముందుకు సాగుతామన్నారు. మూడు కర్తవ్యాలతో బడ్జెట్ రూపకల్పన చేసినట్లు తెలిపారు.నిర్మాణాత్మక సంస్కరణలతో ఈ కర్తవ్యాలను సాధిస్తామని ధీమా వ్యక్తం చేసారు. సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి మొదటి కర్తవ్యమన్నాం ా.ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం,సబ్ కా సాత్ ,సబ్ కా వికాస్ మిగిలిన రెండు కర్తవ్యాలు గా పేర్కొన్నారు. ఏఐ, క్వాంటమ్ సాంకేతికత సహాయంతో కొత్త భారత్ నిర్మాణం దిశగా అడుగులు పడతాయన్నారు 2047 నాటికి లక్ష్యాల సాధన దిశగా పయనిస్తున్నామన్నారు.ఇది యువ శక్తి బడ్జెట్ అన్నారు.లక్ష సాధనకు ఆరు రంగాలపై ప్రధానంగా దృష్టి పెట్టిన్నట్లు పేర్కొన్నారు.రూ.10 వేల కోట్లతో బయో ఫార్మా హబ్ గా భారత్ ను తీర్చి దిద్దాలని నిర్ణయించామని తెలిపారు.అలాగే సెమీ కండెక్టర్ కు రూ.40వేలకోట్లు కేటాయించామన్నారు.హై స్పీడ్ రైల్ కారిడార్ ఢిల్లి,వారణాశి, ముంబై,పూనే ,హైదరాబాద్, చెన్నై, బెంగుళూరుమధ్య అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు.అలాగే రేర్ ఎర్త్ కారిడార్ కా కేరళ,ఏపీ, ఒడిసా, తమిళనాడు లను అభివృద్ధి చేస్తామన్నారు. చిన్న,మధ్యతరగతి నగరాల ఇన్ ఫ్రా అభివృద్ధి కి చర్యలుచేపడతామన్నారు,మెడికల్ టూరిజం





అభివృద్ధిలో భాగంగా మూడు ఆలిండియా ఆయుర్వేద కళాశాలల స్థాపన చేయనున్నామని తెలిపారు. విద్యా,వైద్యానికి టీసీఎస్ 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించామన్నారు.ఒడిసాలో నేషనల్ వాటర్ వే కారిడార్ ఏర్పాటు చేస్తామన్నారు.కంటైనర్ ఉత్పాదిక పెంచడానికి రూ.10 వేలకోట్లుకేటాం ుంచామన్నారు. రేర్ ఎర్త్ మైనింగ్ ద్వారా ఖనిజాల తవ్వకాల ఉత్పాదికత పెరిగే ప్రణాళిక రూపొందించామన్నారు.టెక్స్ టైల్ అభివృద్ధికి మెగా పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. 2025 ఏప్రిల్ 1 వతేదీనుంచికొత్తపన్నువిధానం అమల ులోకి వచ్చిందన్నారు.ఆదాయ పన్నుచెల్లింపులు, ఐటీ రిటర్న్ సరళీకరణ చేశామన్నారు .సామాన ్యుడు సమర్పించేలా నిబంధనలు సడలించావ ున్నారు.జులై 31 వరకూ ఐటీ రిటర్న్లు అందుబాటులో ఉంచుతామన్నారు.మోటార్ యాక్సిడెంట్స్ చెల్లింపులపై పన్ను సడలించామన్నారు.ఆదాయపన్ను పరిమితిలోమా ర్పులేదన్నారు.కార్పొరేట్ ,ఐటి స్లాబ్ ల్లో కూడా మార్పు లేదన్నారు ఆర్థిక మంత్రి.విదేశీ పర్యటనలు ప్యాకేజీ లకు టీసీఎస్ 5 నుంచి 2 శాతానికి తగ్గించామన్నారు.నేషనల్ హస్పటాలిటీ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళలకు షీ మార్ట్సఏర్పాటు కు ప్రోత్సాహం ఇస్తామన్నారు. 20 వాటర్ వే కారిడార్స్ ద్వారా జలమార్గాలకు ప్రాముఖ్యత అందిస్తామన్నారు. మెడికల్ హెడ్స్ తో ఉపాధికల్పన పెరుగుతుందన్నారు.ఐదు రీజనల్ మెడికల్ హెడ్స్ ఏర్పాటు చేస్తామన్నారు.కొబ్బరి,కాజు పరిశ్రమలకు చేయూత ఇస్తామన్నారు.క్లౌడ్ సర్వీసులకు 2047 వరకూ వెసులుబాటు కలిగిస్తాయి న్నారు.విదేశీ ఆస్తుల ప్రకటనకు వన్ టైం స్కీం ప్రవేశ పెడుతున్నారనా ్నరు,జీడీపీలో ద్రవ్య లోటు తగ్గిస్తామని2021-22 లో ఇచ్చిన హామీ నెరవేర్చామన్నారు.ఏఐ సాంకేతికతో విద్యార్థుల,రైతుల భవిష్యత్తుకు బాటలు వేసే



ప్రణాళిక రూపొందించేందుకు చర్యలు చేపట్టామన్నారు.ప్రతి జిల్లాలో మహిళా వసతిగృహాలు నెలకొల్పుతావ ున్నారు.ఫారిన్ ఫ్రెండ్లీపేరుతో ఫెమాలో భారీ మార్పులు తెస్తున్నామన్నారు. విదేశీయాత్రలపైపన్నులు తగ్గింపు చర్యలు అమలులోకి రానున్నాయి.బయో ఫార్మా రంగం లో పరిశోధనలు వేగవంతం చేసి రూపురేఖలు మార్చుతాయన్నారు.బడ్జెట్లో ఆత్మ నిర్భర్ భారత్ కేటాయింపులు జరిగాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.పేదల ు,దళితులు,వ ుహిళలు, యువత కు బడ్జెట్లో పెద్దపీట వేసామని,చిన్న పరిశ్రమల కు ప్రోత్సాహం ఇస్తామన్నారు. నగరాల అభివృద్ధి లో భాగంగా ఏపీకి మేలు జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. హైదరాబాద్ - బెంగుళూరు హైస్పీడ్ రైల్ కారిడార్ కూడా ఏపీకి ప్రయోజనం కలుగుతుందని వారు తెలిపారు.ఏదిఏమైనా ఈ బడ్జెట్ లో మధ్యతరగతి వర్గానికి పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. ఆర్థిక సంస్కరణలు మరింత ముందుకు తీసుకు వెళ్లే చర్యలతో పేద బడుగు,రైతు,నిరుద్యోగ వర్గాలకు ఎంతవరకు ప్రయోజనం కలుగుతుందనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

యం.వి.రామారావు



కూకట్‌పల్లి నియోజకవర్గం భరత్ నగర్ కాలనీలోని హరిహరక్షేత్రం లో మాఘ పౌర్ణమి సందర్భంగా గురు స్వామి నరసింహ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర పూజా కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నాగిరెడ్డి, వికే రావు, జి.ఎల్. రెడ్డి తో పాటు స్థానిక భక్తులు ఆంజనేయులు, గురుస్వామి, నాగరాజు, మహేష్, రమేష్, శ్రావణ్, వేణు గోపాల్ తదితరులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ, మాఘ పౌర్ణమి ఉత్సవాన్ని ఆధ్యాత్మికంగా ఘనంగా జరుపుకున్నారు.

- నవతరం, కూకట్పల్లి

## పట్టు వస్త్రాలు సమర్పించిన మేకల బండ చెంచు గిరిజన మహిళలు



మేడారం / శ్రీశైలం, నవతరం: శ్రీశైలం మేకల బండ చెంచు గిరిజన నివాసితులు దాదాపు 50 మందితో ట్రస్ట్ బోర్డు నెంబర్ గుడ్ల గంగమ్మ ఆధ్వర్యంలో శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల పట్టు వస్త్రాలతో పాటు కుంకుమ, గాజులు, సంప్రదాయ దుస్తులతో భక్తిశ్రద్ధలతో వారి చెంచు కాలనీ నుండి ర్యాలీగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి కు పూజలు చేసి అనంతరం శ్రీశైల దేవస్థానం ఈఓ శ్రీనివాస రావు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమేష్ నాయుడు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో శ్రీశైల దేవస్థానం బస్సులో మేడారం జాతరకు బయలుదేరారు. ఈ సందర్భంగా సమ్మక్క సారక్కల జాతర సందర్భంగా అమ్మవార్ల పట్టు వస్త్రాలు జంపన్న వాగు నుండి ఊరేగింపుగా బయలుదేరి సమ్మక్క సారక్కల కు భక్తిశ్రద్ధలతో శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ప్రత్యేక పూజలు చేసి బయలుదేరి మేడారం సమ్మక్క సారక్క జాతరలో అమ్మవార్లకి పట్టు వస్త్రాలను సమర్పించారు. వారితోపాటు కొమురం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై ఆశీర్వాదం, ఉపాధ్యక్షులు పిట్ట భ్రమరాంబ పార్వతి, దేవస్థానం డ్రైవర్ వై కోటేశ్వరరావు, కుడుముల బయన్న అంజమ్మ తోకల అనుమమ్మ దంసాని శీను, గుండ్ల నాగలింగం, దంసాని అంజయ్య, పిట్ట పోతురాజు, గంసాని లింగయ్య, చెవుల సరస్వతి, కుడుముల రుప్పినికుడుముల, గుండ్ల మల్లమ్మ, మల్లీ లక్ష్మి, చెవుల మల్లమ్మ, శ్రీశైలం మేకల బండ చెంచు గిరిజన మహిళలు యువత వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు పాతర, పర్మిషన్లు లేని షట్టర్లు

**అనుమతులు లేకుండానే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం**

**- మున్సిపల్ అధికారుల కళ్ళుగప్పి కట్టడాలా? లేక కళ్ళు మూసుకుని సహకరిస్తున్నారా?**

**- తలెత్తనున్న ట్రాఫిక్ సమస్యలు**

**- ప్రభుత్వం అంటే ప్రజల ఆస్తి పరుల పాలు**

**- మున్సిపల్ / పంచాయతీ రూల్స్ "షెడ్డు" కెక్కాయి**

**- మ్యాపులోని చిన్న గీత నరకానికి దారి**

**- గత పంచాయతీ ఏమన్నా పర్మిషన్లు ఇచ్చిందా?**

**- నిద్రావస్థలో జోగుతున్న అధికారులు**

అశ్వారావుపేట, నవతరం ప్రతినిధి: నిబంధనలు మంటగలుస్తున్నాయి.. అధికారుల పర్యవేక్షణ నీరు గారుతోంది. అశ్వారావుపేట మండల కేంద్రంలోని అత్యంత కీలకమైన రింగురోడ్డు సెంటర్ అక్రమ కట్టడాలకు అడ్డాగా మారుతోంది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వరావుపేట మండల కేంద్రంలోని అత్యంత రద్దీగా ఉండే రింగు రోడ్డు సెంటర్‌లో నిబంధనలు గాలికి వదిలేసి అక్రమ నిర్మాణాలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. స్థానిక మసీదును ఆనుకొని, డ్రైనేజీ వ్యవస్థను సైతం లెక్కచేయకుండా నిర్మాణం సాగుతోంది. నేషనల్ హైవే (ఎన్ హెచ్ ఎ ఐ) స్థలానికి అతి సమీపంలో సుమారు 20 షట్టర్ల నిర్మాణానికి యత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే సెంట్రింగ్ పనులు పూర్తి చేసి స్లాబ్ వేసేందుకు సిద్ధంగా ఉండటం గమనార్హం. పైగా నేషనల్ హైవే (ఎన్హెచ్ఎఐ) కి సంబంధించిన స్థలం అయితే భద్రతా కారణాల దృష్ట్యా ఆక్రమణలు మరింత ప్రమాదకరం. షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. గత పంచాయతీ ఈ కట్టడాలకు పర్మిషన్లు ఇచ్చిందా అనే అనుమానాలూ లేకపోలేదు. మ్యాపుల్లోని చిన్న గీత ఈ వివాదానికి తెర లేపిందా? ఈ విషయంపై నవతరం పత్రిక మరిన్ని అంశాలను మీ ముందు ఉంచబోతోంది.ట్రాఫిక్ నరకం

అప్పటికే రద్దీగా ఉండే సెంటర్లో ఈ కట్టడాల వల్ల రోడ్డు మరింత తీర్పుగా మారి నిత్యం ప్రమాదాలు జరిగే ముప్పు పొంచి ఉంది.

ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ

సెంట్రల్ లైటింగ్ డ్రైనేజీలను కప్పివేస్తూ నిర్మిస్తున్న ఈ షట్టర్లు భవిష్యత్తులో ప్రభుత్వ మౌలిక సదుపాయాల విస్తరణకు అడ్డంకిగా మారనున్నాయి.





అధికారుల సమాధానం విస్తుపోతున్న జనం... ఈ నిర్మాణంపై 'నవతరం' ప్రతినిధి మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా, సదరు కట్టడాలకు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఒకవేళ అది అక్రమ కట్టడమే అయితే మున్సిపల్ అధికారుల కు అడ్డుకునే అధికారం లేదా? అటు రోడ్డు భవనాల శాఖ (ఆర్ అండ్ బి) అధికారులు సైతం తమకు ఈ విషయంలో ఎలాంటి సమాచారం లేదని, అది నేషనల్ హైవే పరిధిలోకి వస్తుందని పేర్కొంటున్నారు. అధికారులు అనుమతులు లేవని చెబుతున్నా, పనులు మాత్రం నిరంతరాయంగా సాగడం వెనుక ఉన్న "అదృశ్య శక్తి" ఎవరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదాలకు పొంచి ఉన్న ముప్పు

సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ వ్యవస్థను ఆనుకొని ఈ షట్టర్లు నిర్మించడం వల్ల రోడ్డు మరింత ఇరుకుగా మారే అవకాశం ఉంది. దీనివల్ల:

ట్రాఫిక్ సమస్యలు తలెత్తి వాహనదారులకు ఇబ్బందులు కలగడం. మలుపుల వద్ద దృష్టి మళ్లడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండటం. ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు మార్గం సుగమం కావడం. అధికారుల బాధ్యత ఏది? అనుమతులు లేవని చెబుతున్న మున్సిపల్ అధికారులు, కేవలం మాటలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో నిర్మాణాలను ఎందుకు అడ్డుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ కట్టడాలను నిలిపివేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ మరియు హైవే అధికారులపై ఉంది. నా అభిప్రాయం:

మీరు అడిగినట్లుగా, మున్సిపల్ కమిషనర్‌కు ఆ నిర్మాణాన్ని ఆపే అధికారం ఖచ్చితంగా ఉంది. అనుమతి లేని కట్టడాలను నోటీసులు ఇచ్చి కూల్చివేసే అధికారం మున్సిపల్ అధికారులకు ఉంటుంది.

అధికార యంత్రాంగం ఏం చేస్తోంది?అనుమతులు లేవని చెప్పడం కాదు అక్రమంగా వెలుస్తున్న ఆ షట్టర్లను కూల్చివేసే దమ్ము మున్సిపల్ యంత్రాంగానికి





ఉందా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్ హెచ్ ఏ ఐ కి సంబంధించిన ఖమ్మం లోని ఉన్నతాధికారులు జోక్యం చేసుకునే వరకు స్థానిక అధికారులు వేచి చూస్తారా?, ప్రజా భద్రతలు ఫణంగా పెట్టి కొందరి స్వార్థం కోసం రోడ్లను ఆక్రమిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు, ఈ అక్రమ కట్టడాలపై జిల్లా కలెక్టర్గా మరియు హైవే అథారిటీ తక్షణమే స్పందించి విచారణ జరిపించాలనీ పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# అవినీతిపై సింహస్వప్నం.. ప్రజా బలం నమ్ముకుని బరిలోకి

- 22వ వార్డు అభ్యర్థిగా తగరం అక్కులయ్య!
- ఆధార్ పార్టీ తరపున వార్డు కౌన్సిలర్ గా నామినేషన్
- గతంలో వివిధ ప్రభుత్వ శాఖలలో జరిగిన అన్యాయాలను అక్రమాలను సాక్షాధారాలతో బయటపెట్టిన ఘనత ఆయనది







అశ్వారావుపేట, నవతరం ప్రతినిధి: అశ్వారావుపేట మున్సిపాలిటీ 22వ వార్డు రాజకీయం ఆసక్తికర మలుపు తిరిగింది. నిత్యం ప్రజా సమస్యలపై గొంతెత్తుతూ, ప్రభుత్వ శాఖల్లోని లోపాలను ఎండగట్టే తగరం అక్కులయ్య ఆధార్ పార్టీ తరపున కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ధనబలం, అంగబలం ఉన్న నేతల మధ్య, కేవలం "ప్రజా బలం" మరియు "నైతికత" ఆయుధాలుగా ఆయన ఎన్నికల బరిలోకి దిగారు.అవినీతి అధికారుల గుండెల్లో నిద్ర..

తగరం అక్కులయ్యకు సామాన్య అభ్యర్థిగా కాకుండా, ఒక పోరాట సైనికుడిగా స్థానికంగా మంచి గుర్తింపు ఉంది. గతంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో జరిగిన అన్యాయాలను, అక్రమాలను సాక్ష్యాధారాలతో బయటపెట్టిన ఘనత ఆయనది. తన పోరాటాల ద్వారా ఎంతో మంది అవినీతి అధికారుల అసలు స్వరూపాన్ని బయటపెట్టి, వారు విధుల నుండి తొలగిపోయేలా చేసిన ట్రాక్ రికార్డ్ ఆయన సొంతం.

పేదరికం నుండి ప్రజా సేవకు..

ఆర్థికంగా వెనుకబడిన వర్గానికి చెందిన అక్కులయ్య, పేదవాడి కష్టాన్ని ప్రత్యక్షంగా అనుభవించిన వ్యక్తి.

"నాకు రాజకీయ బలం లేదు, పంపిణీ చేయడానికి ధనబలం అంతకన్నా లేదు. కానీ, నేను చేసిన పోరాటాలను చూసిన ప్రజల ఆశీస్సులు నాకు ఉన్నాయి. అదే నన్ను గెలిపిస్తుంది" అని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.లక్ష్యం: 22వ వార్డు సమూల మార్పు

గెలిచిన తర్వాత కూడా పాత పద్ధతుల్లోనే పాలన కొనసాగించే నాయకులకు భిన్నంగా, 22వ వార్డులో విప్లవాత్మక మార్పులు తేవడమే తన లక్ష్యమని అక్కులయ్య తెలిపారు.

# ఖబర్దార్ రేవంత్ రెడ్డి

## కూకట్పల్లి బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్ ఆరోరా



కూకట్పల్లి, నవతరం: ఆకాశం లాంటి కెసీఆర్ పై అనవసరపు ఆరోపణలతో బురదాజల్లేందుకు యత్నిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వమా ఖబర్దార్ రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా ఉందని కూకట్పల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కో ఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా హెచ్చరించారు. అలుపెరగని పోరాటంతో చావు నోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సంబంధం లేని అంశంలో నోటీసులు జారీ చేసి ఇబ్బందులకు గురిచేయడం తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని తగిన సమయంలో తగిన గుణపాఠం చెపుతారని తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిపారని, ఆయనే లేకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చేదా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆయన చలువతో తెలంగాణ రాకతో మీ అందరికీ రాజకీయ ఉజ్జ్వల భవిష్యత్తు లభించిందని దానిని ప్రజలకు సేవ చేసేందుకు ఉపయోగించకుండా కేసిఆర్ లాంటి మహోన్నత వ్యక్తులను అవమానించేందుకు ఉపయోగించడాన్ని తెలంగాణ ప్రజానీకం ఎన్నటికీ సహించదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఎన్ని కుప్పిగంతులు వేసిన బిఆర్ ఎస్ పార్టీని కేసిఆర్ ను ఏమీ చేయలేరని ఎద్దేవా చేశారు. కెసిఆర్ ఉద్యమ పుణ్యమాని తెలంగాణ రాష్ట్రానికి సేవ చేసే భాగ్యం లభించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పటికైనా తెలంగాణ ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు. ఇదే ధోరణి కొనసాగితే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నాయకుల పరిస్థితి దారుణంగా ఉంటుందని హెచ్చరించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



కూకట్పల్లి, నవతరం: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ ను ఫోన్ టాపింగ్ విషయంలో సిట్ విచారణ నేపథ్యంలో కూకట్పల్లి నియోజకవర్గంలో అన్ని డివిజన్లో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపి కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.. అనంతరం... ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గ కార్పొరేటర్లు బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నంది నగర్ లోని ఆయన నివాసానికి చేరుకుని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ నేడు కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించకుంటే ఈ రోజు ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి ఉండేనా అని ప్రశ్నించారు.. కనీస గౌరవం ఇవ్వకుండా కక్షపూరిత రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. అభివృద్ధిని పక్కనపెట్టి ఏదో విచారణ పేరుతో బిఆర్ఎస్ నాయకులు ను ఇబ్బంది పెడుతున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో తిరిగి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కేసీఆర్ అవుతారని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పై దృష్టి సారించాలని హితవు పలికారు.

ముప్పై మూడు గజాలకు టాక్స్ కట్టి, డెబ్బై...

ఎనభై నాలుగు గజాలు అంటూ అక్రమ భవన నిర్మాణానికి తెరాలేపాడో ప్రబుద్ధుడు. కాలనీవాసులు అభ్యంతరం చెప్పేసరికి రాజకీయ నాయకుల చొరవతో మళ్ళీ ఫామ్లోకొచ్చిన ?సదరు కేటుగాడు... కనీసం బల్దియా భయం లేకుండా చకచకా పనులు కానిచ్చేస్తున్నాడు. అందుకు అందినకాడికి దండుకున్న కొందరు పక్కబస్తీ నాయకులు అండగా నిలుస్తున్నారంటూ పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు స్థానిక ప్రజలు. గతంలో ముప్పై మూడు గజాల్లో శెట్టర్లు నిర్మించుకున్న సదరు నిర్మాణదారుడు ప్రస్తుతం మాత్రం అందుకు భిన్నంగా 2015, 2003 అంటూ కొందరు కేటుగాళ్ళ మద్దతుతో... కొత్త కొత్త ఎత్తుగడలు వేస్తూ... మొత్తానికి 84 గజాల నోటరీ డాకుమెంట్ ఒకటి సంపాదించాడు. అందుకు తగ్గట్టుగా మూడు రోడ్ల బిట్టు, అడ్డుచెప్పేవారు ఎవరూ లేకపోవడం.. కలిసొచ్చేసరికి లైన్ క్లియర్ అయింది. కానీ పాత ఫోటోలు మాత్రం చెరపలేకపోయాడు. దీంతో పప్పులో కాలేసినట్టయింది, బోల్తా పడే సమయం ఆసన్నమయింది. ప్రభుత్వ భూమి ఆక్రమణ, హై టెన్షన్ కరెంట్ వైర్ల కింద నిర్మాణం, జీరో పర్మిషన్... ఇలా అన్నిదారులూ అక్రమాలవైపే... ఇకనైనా చర్యలు తీసుకుని సదరు నిర్మాణాన్ని కూల్చివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎంతో నిబద్ధతతో అనుక్షణం సముద్ర ప్రాంత గస్తీ నిర్వహిస్తూ దేశానికి రక్షణ కవచంలా కోస్ట్ గార్డ్ దళాలు అందిస్తున్న సేవలు అనిర్వచనీయమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొనియాడారు. భారత తీర రక్షక దళ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి తీర రక్షణ దళాలకు హార్ధిక శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ భద్రతతో పాటు మత్స్యకారులు, నావికుల రక్షణ, కాలుష్య నియంత్రణ, సముద్ర పర్యావరణ పరిరక్షణ, ఆపత్కాలాల్లో రెస్క్యూ ఆపరేషన్స్ వంటి ఎన్నో సేవలు అందిస్తున్న తీర రక్షక దళం సిబ్బంది, అధికారులు, యంత్రాంగం, వారి కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.

– నవతరం, హైదరాబాద్

ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో సౌమ్య ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సౌమ్య మృతికి కారణమైన వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సౌమ్య కుటుంబానికి ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

– నవతరం, హైదరాబాద్

# శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకున్న బైండ్ల కుమార్



శ్రీశైలం, నవతరం: టెలికం బోర్డు మెంబర్ బిజెపి నాయకులు బైండ్ల కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలంలో ఉన్న పవిత్ర శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో శ్రీ మల్లికార్జున స్వామి స్పర్శ దర్శనం చేసుకోవడం జరిగింది అనంతరం , అమ్మ భ్రమరాంబ దేవి ఆశీర్వాదాలు తీసుకున్నాను. జ్యోతిర్లింగాల్లో ఒక్కటైన ఈ ఆలయంలో ఆ శివయ్య శ్రీ మల్లికార్జున స్వామిగా పూజలు పొందుతున్నారు. ఆరాధన, ఆత్మజ్ఞానం, మోక్ష మార్గానికి ఇది ప్రతీక. ఈ క్షేత్రం 18 మహాశక్తి పీఠాలలో ఒకటి. ఇక్కడ అమ్మ భ్రమరాంబ దేవి శక్తి రూపంలో విరాజిల్లుతోంది. సతి దేవి మెడ భాగం ఈ ప్రాంతంలో పతనమైందని చరిత్ర చెబుతోంది. నల్లమల కొండల మధ్య, కృష్ణా నది తీరాన ఉన్న శ్రీశైలం ఆధ్యాత్మిక చైతన్యానికి గుర్తుగా నిలుస్తోంది. ఈ పవిత్ర ప్రదేశంలో పర్యటించడం నా పూర్వ జన్మ అదృష్టంగా భావిస్తున్నాను. ఆ మహా శివుని ఆశీస్సులతో సమాజంలోని ప్రజలతో పాటు ప్రతీ జీవి మనుగడ సాఫీగా సాగాలని ప్రార్థిస్తున్నానన్నారు బైండ్ల కుమార్.

# గుంటూరులో జరిగిన ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నాం

### సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ

విజయవాడ, నవతరం: శనివారం గుంటూరులో జరిగిన ఘటనలను సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దీనికి సంబంధించి ఆదివారం శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్ర ప్రజల సమస్యలను పక్కదారి పట్టించి, వాతావరణాన్ని కలుషితం చేస్తున్న ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైసిపి లపై ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వైసిపి నాయకులు అంబటి రాంబాబు అభ్యంతరకరమైన భాషలో అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని సిపిఐ(యం) ఖండిస్తున్నదన్నారు. ఈ భాష రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేస్తుందని చెప్పారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతుందన్నారు. దీనిపై వైసిపి ప్రజలకు బాధ్యతాయుతంగా వివరణ ఇచ్చుకోవాలి అని అన్నారు. ఈ ఘటన ఆసరా చేసుకుని టిడిపి వారు రాంబాబు ఇంటిపై దాడి చేయడాన్ని కూడా సిపిఐ(యం) ఖండిస్తున్నదన్నారు. భౌతిక దాడులతో ప్రజలు భయభ్రాంతులకు గురవడమే కాదు దీనివల్ల సమస్య పరిష్కారం కాకపోగా చట్టబద్ధ పాలనకు విఘాతం కలుగుతుందనీ, దీనికి టిడిపి ప్రభుత్వం బాధ్యత వహించాలని చెప్పారు. ఈ ఘర్షణకు కారణమైన తిరుమల లడ్డు వివాదంపై సిట్ నివేదిక వెల్లడి కాకుండానే వివిధ కథనాలు ఎవరికి తోచిన విధంగా వారు ప్రచారం చేసుకుంటూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సిట్ నివేదికను బహిరంగ పరిచి, వాస్తవాలు వెల్లడించాలని ప్రభుత్వాన్ని వి.శ్రీనివాసరావు కోరారు.

# నిద్రమత్తులో గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్...?



గుమ్మడిదల మున్సిపాలిటీ, నవతరం: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి గ్రామం లో ఎస్సీ బస్తి లో గల మున్సిపల్ కార్మికులు చేయవలసిన పని ఎవరి ఇంటి ముందు వారు పేరుకుపోయిన డ్రైనేజి తీసుకోవాల్సి వస్తుంది. డ్రైనేజీలు ఫుల్ అయినా గాని మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడం లేదంటూ... మాఇంటి ముందు మేము డ్రైనేజీ తీసుకుంటున్నామంటూ... తీసుకుంటున్న ఇంటి యజమానులు.. గత కొన్ని రోజులుగా నిల్వ ఉన్న డ్రైనేజీలో ఫుల్లు నీరు నిలిచిపోయినయ్ అని వాపోతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారని బొంతపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ బస్తి వాసులు నిలదీస్తున్నారు. మా ఇంటి ముందు మా పని మేము చేసుకుంటే ఈ అధికారులు ఎందుకు అంటున్న ఎస్సీ కాలనీవాసులు. కేవలం నెలవారీ జీతాలకే పరిమితం కాకుండా తమ విధులను గుర్తుంచుకుని మున్సిపల్ సిబ్బంది స్వచ్ఛతకు ప్రధాన్యతకు కాసింత ప్రాధాన్యత ఇస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అందుకు మున్సిపల్ కమిషనర్ తన నిద్రమత్తు వీడి తమ సిబ్బందికి సరైన సూచనలు చేస్తే బాగుంటుంది.

# మానుకోట చైర్మన్ గిరిపై మాజీ ఎమ్మెల్యే కూతురు గురి

- 20వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థిగా తేజస్విని బరి
- కాంగ్రెస్ చైర్మన్ అభ్యర్థిగా బాలు చౌహాన్...?



మహబూబాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో 20వ వార్డు రాజకీయంగా హాట్ టాపిక్గా మారింది. ఈ వార్డు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ కుమార్తె తేజస్విని బరిలోకి దిగుతున్నారు. విద్యావంతురాలిగా గుర్తింపు పొందిన తేజస్వినికి రాజకీయ కుటుంబ నేపథ్యం ప్రధాన బలంగా మారిందని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల తొర్రూరు మండలం మడిపెల్లి గ్రామానికి చెందిన మేనత్త కుమారుడితో వివాహం చేసుకున్న తేజస్విని, ప్రస్తుతం రాజకీయంగా క్రియాశీలకంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. మానుకోట మున్సిపల్ చైర్మన్ గిరిపై నేరుగా పోటీగా ఈ వార్డును బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. యువత, మహిళల మద్దతు తనకు ఉందని తేజస్విని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ప్రచారంలో పేర్కొంటున్నారు. ఇదే వార్డులో బీఆర్ఎస్ నుంచి మేస్త్రి శంకర్, కాంగ్రెస్ నుంచి విద్యావంతులు, కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు, గిరిజన ఉద్యమ నేత, గతంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మూడ్ బాలు చౌహన్, హత్తిరం అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. 11వ వార్డు నుంచి బూక్య నెహ్రూ నాయక్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు సమాచారం.కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు అధికారికంగా చైర్మన్ అభ్యర్థిని ప్రకటించకపోయినా, 20, 15, 17 వార్డుల్లో నామినేషన్ వేసిన మూడ్ బాలు చౌహన్నే చైర్మన్ అభ్యర్థిగా ప్రజల్లో ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలతో మహబూబాబాద్ మున్సిపల్ రాజకీయాలు ఉత్కంఠభరితంగా మారాయి.

డి. వై. గిరి
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,
మహబూబాబాద్
సెల్: 7013667743

## రిటర్న్ గిఫ్ట్ ఇయ్యడం ఖాయం



కుత్బుల్లాపూర్, నవతరం: కేసీఆర్ నాయకత్వంలో రాబోయే రోజుల్లో ప్రభుత్వంలోకి రావడం ఖాయం. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న ఈ ప్రభుత్వానికి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడం ఖాయమన్నారు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మా పార్టీ నాయకులపై విచారణలు చేయడం తప్పా ప్రభుత్వం చేసింది ఏమి లేదు.. చట్ట విరుద్ధంగా పసలేని కేసులతో విచారణపేరుతో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ని ఇబ్బంది పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు చర్యలను ఎండగడుతూ తెలంగాణ భవన్ వేదికగా విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రభుత్వ పాలన, కక్ష సాధింపు చర్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ....

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి మా అధినాయకుడు కేసీఆర్ ను, మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను, మా నాయకులు హరీష్ రావు ను ఇబ్బందులకు గురి చేస్తూ కక్ష సాధింపుతో ఇబ్బందులకు చేయాలని చూడడమే తప్పా చేసింది ఏమీ లేదు.

కక్ష సాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతుందని నిదర్శనంగానే చట్ట విరుద్ధంగా మా అధినాయకులు కెసిఆర్ ను నోటీసులు ఇచ్చి ప్రశ్నించడమే నిదర్శనం.

స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) ను ఏర్పాటు చేసిందే కేసీఆర్ ను, మా పార్టీ నాయకులను ఇబ్బంది పెట్టడానికే.

ప్రభుత్వం ఏర్పడి మూడు రెండు సంవత్సరాలు పూర్తి చేసుకొని, మూడు సంవత్సరాలు కావస్తున్న ఇంకా ఫోన్ ట్యాపింగ్ కేసు ఏందిరా నాయనా అని ప్రజలు పెదవి విరుస్తున్నారు.అధికారంలో వచ్చిన వంద రోజుల్లో అమలుచేస్తామన్న ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏమైనాయి అని ప్రజలు అడుగుతా ఉన్నరు. మీరిస్తామన్న సంవత్సరం లోపు రెండు లక్షల ఉద్యోగాలు ఏమైనాయి అని అడుగుతా ఉన్నారు. ఈ విధంగా ప్రజలు ప్రశ్నిస్తున్నారని ప్రజల దృష్టిని మళ్లించేందుకు "డైవర్షన్ పాలిటిక్స్" ను చేస్తూ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతుంది.

మా నాయకులను అప్రజాస్వామికంగా నిర్బంధం చేస్తూ నిర్బంధ కాండపు పాల్పడుతుంది ఈ ప్రభుత్వం. కెసిఆర్ కు ప్రజలు నీరాజనాలు పలుకుతా ఉంటే ఎక్కడికక్కడ వారిని నిర్బంధిస్తూ నిర్బంధ కాండకు పాల్పడుతుంది ఈ ప్రభుత్వం.

చట్టంలో 65 ఏళ్ల పైబడిన ఎవరినైనా వారి ఇంట్లోనే విచారించవచ్చునీ హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నా ప్రభుత్వం వాటిని ఉల్లంఘిస్తూ అన్యాయంగా మా పార్టీ ఇబ్బందులకు గురిచేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అడిస్తున్నట్టు సిట్ అధికారులు ఆడుతూ ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మగా మారింది పోలీసు వ్యవస్థ అని ఆరోపణలు చేస్తా ఉన్నాను.

మీరు మీ హద్దు దాటి, చట్టవిరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతిలో కీలు బొమ్మలుగా మారి రాత్రి వేళ్లలో నోటీసులు ఇచ్చే విధంగా ఎందుకు వ్యవహరిస్తా ఉన్నారు.

అది కూడా ఇప్పుడు ముఖ్యమంత్రి ఇక్కడ లేరు, ముఖ్యమంత్రి చదువుకొనే సమయంలో చదువుకోకుండా ఇప్పుడు ఈ వయసులో చదువుకుంటున్నారు. ఆయనకు చదువు కంటే ఎక్కువ సంస్కారం సరం. ముఖ్యమంత్రి డైరెక్షన్లోనే సిట్ నాటకాలు ఆడుతా ఉన్నది. అక్కడ తెల్లారినంక, ఇక్కడ రాత్రి అయినంక అది ఇంట్లో ఎవరులేని సమయంలో వచ్చి అంటిస్తా నోటీసు గోడకు అంటిస్తా ఉన్నారు. ఇది పోలీసు వారు చేస్తున్న దుశ్చర్య.

ప్రభుత్వం అహంకారపూరితంగా వ్యవహరిస్తా ఉన్నది. ప్రభుత్వానికి తోడుగా పోలీస్ వ్యవస్థ పని చేస్తా ఉన్నది.

?? కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైనది. వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఈ డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడతా ఉన్నది.

?? మున్సిపల్ ఎలక్షన్స్ నడుస్తా ఉంటే మమ్మల్ని ఇబ్బందుల గురిచేస్తూ ప్రజా క్షేత్రంలో తిరగకుండా ఉంచాలనే ఆలోచనతో వ్యవహరిస్తా ఉన్నది.

?? ఈ చర్యలన్నీ ముఖ్యమంత్రి సంకుచిత మనస్తత్వానికి దర్పణం పడుతా ఉన్నయి. రాజకీయాలు ఎప్పుడూ హుందా తనంగా చేయాలి గాని, సంకుచిత మనస్తత్వంతో కాదు.

?? ప్రభుత్వ పాలన అనేది ఈ విధంగా అరాచకాలు, నిర్బంధాలతో చేస్తామంటే రాబోయే రోజుల్లో ప్రజల్లో గుణపాఠం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తా ఉన్నాను. పోలీసులు కూడా చట్టానికి లోబడి పనిచేస్తేనే మంచిది. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. అధికారం అనేది వస్తా ఉంటది, పోతా ఉంటది, మారుతా ఉంటది. భవిష్యత్తులో వీటన్నింటిపై పోలీస్ వారు సమాధానం చెప్పాల్సి ఉంటదని మనవి చేస్తా ఉన్నను.ప్రభుత్వ వైఫల్యాలను కేంద్రంలోని సోషియో ఎకానమీ ఫోరం కూడా చెప్పింది. మేడిగడ్డను వెంటనే మరమ్మత్తులు చేయండి, కాళేశ్వరం ద్వారా తెలంగాణ సస్యశ్యామలం అయ్యిందని కేంద్ర ప్రభుత్వం చెప్పింది.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ద్వంద వైఖరిని మానుకోవాలి, పోలీస్ శాఖ ద్వంద వైఖరిని మానుకోవాలి. ప్రజలను తప్పుదోవ పట్టించే డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలి.

?? ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆధారాలు లేవు, పసలేదు. బురద చల్లడంలో భాగంగానే ఈ నాటకాలు.

గత రెండేళ్ల కాలంలో కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్, ఫోన్ ట్యాపింగ్ పై సిట్, ఫార్ములా ఈ పై ఏసీబీ కేసు, గొర్రెల పంపిణీపై విచారణ, విద్యుత్ కొనుగోళ్లపై విచారణ, ధరణి పై విచారణ, ఔటర్ రింగ్ రోడ్ పై విచారణ, బతుకమ్మ చీరలపై విచారణల పేర్లతో వీళ్ల ఎంక్వైరీ లు చేయడాన్ని ప్రజలు గమనిస్తా ఉన్నరు.

# జాతర కీలక ఘట్టం ఆవిష్కృతం

**లి కన్నెపల్లి నుంచి గద్దెపైకి కొలువు తీరిన సారలమ్మ**
**లి కన్నెపల్లి లో మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ప్రత్యేక పూజలు**



మేడారం, నవతరం: తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క--సారలమ్మ మహా జాతరలో అత్యంత కీలక ఘట్టం బుధవారం భక్తి పరవశ్య వాతావరణంలో ఆవిష్కృతమైంది. కోట్లాది భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఘడియ సాయంత్రం ప్రారంభమవగా, కన్నెపల్లి నుంచి గద్దెపైకి శ్రీ సారలమ్మ కొలువు తీరడం జాతరలో తొలి ప్రధాన ఘట్టంగా నిలిచింది.ఈ ఘట్టానికి ముందుగా పూజారులు, జిల్లా యంత్రాంగం కన్నెపల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమ్మక్క దేవతల పూజారులు సిద్ధబోయిన వారి ఇంటికి చేరి సంప్రదాయ కార్యక్రమాలు చేపట్టగా, కొండాయి గ్రామం నుంచి గోవిందరాజుల దేవతను కన్నెపల్లికి తీసుకువచ్చారు. అనంతరం శ్రీ సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య,పూజారులు కాక వెంకటేశ్వర్లు, కాక కిరణ్ కుమార్, కాక కనకమ్మ, కాక భుజంగరావు, కాక లక్ష్మీబాయి లతో పాటు గోవిందరాజుల పూజారి దుబ్బకట్ల గోవర్ధన్‌లు కలిసి ఆదివాసీ ఆచారాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.దాదాపు రెండు గంటల పాటు కన్నెపల్లి సారలమ్మ ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సుమారు సాయంత్రం 7, గంటలకు సారలమ్మ అమ్మవారు కన్నెపల్లి నుంచి బయలుదేరారు. జంపన్న వాగు మీదుగా మేడారం గ్రామానికి చేరుకున్న సందర్భంగా పూనకాలతో తన్మయత్వానికి లోనైన భక్తులు, డప్పు వాయిద్యాల





నడుమ దారి పొడవునా అమ్మవారికి ఘన స్వాగతం పలికారు. ఈ ఘట్టంతో మేడారం పరిసరాలు భక్తి పరవశ్యంతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.రాత్రి 12.30 గంటలకు గద్దెల ప్రాంతానికి చేరుకున్న సారలమ్మ అమ్మవారికి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోవిందరాజులు, పగిడిద్దారాజులతో కలిసి అర్ధరాత్రి గద్దెపైకి అమ్మవారు చేరుకున్నారు. ప్రధాన పూజారి సారయ్య అమ్మవారిని గద్దెలపైకి తీసుకొచ్చి కొలువు తీర్చారు.ఈ ఘట్టానికి ముందు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌లు శ్రీ సారలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కన్నెపల్లి గ్రామస్తులతో కలిసి ఆదివాసీ గిరిజన సంప్రదాయా నృత్యాల్లో పాల్గొని జాతర ఆధ్యాత్మికతను మరింత పెంచారు. దీంతో మేడారం సమ్మక్క--సారలమ్మ మహా జాతరలో తొలి కీలక ఘట్టం విజయవంతంగా పూర్తికాగా, కొంగుబంగారు తల్లి శ్రీ సారలమ్మ గద్దెపై కొలువు తీరుతూ భక్తులకు దీవెనలు ఇస్తోంది. ఇక జాతరలోని తదుపరి ఘట్టాల కోసం భక్తజనం ఉత్కంఠతో ఎదురుచూస్తోంది.

# కెమెరామెన్‌పై దాడి కాదు ఇది

- **ప్రత్యక్ష ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి**
- **జర్నలిస్టులపై దాడులు సహించేది లేదు**
- **కలం శక్తి ఏమిటో చాటిచెబుతాం**
- **చుంచు కుమార్, అఖిల భారతీయ జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్‌చైర్మన్**



హైదరాబాద్, నవతరం: ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగవ స్తంభంగా నిలిచే మీడియాపై జరుగుతున్న దాడులు దేశ ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని అఖిల భారతీయ జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ చైర్మన్ చుంచు కుమార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ భవన్ సమీపంలో కవరేజ్ నిమిత్తం వెళ్లిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థకు చెందిన కెమెరా జర్నలిస్ట్ పవన్‌పై బీఆర్ఎస్ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేయడం అమానుషమని, ఇది ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచే చర్యగా ఆయన ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై దాడి చేయడం అంటే ఒక్క వ్యక్తిని లక్ష్యంగా చేసుకోవడం కాదని, ప్రజలకు నిజం తెలిసే హక్కును హరించడమే కాకుండా ప్రత్యక్ష ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్టేనని ఆయన స్పష్టం చేశారు. ప్రజల కళ్లుగా, చెవులుగా పనిచేసే మీడియాను గాయపరిస్తే సమాజం అంధకారంలోకి నెట్టబడుతుందని హెచ్చరించారు. మీడియాను బెదిరింపులతో, దాడులతో మౌనం చేయాలన్న ప్రయత్నాలు ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రమాదకర చర్యలని చుంచు కుమార్ పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతును అణచివేయాలన్న ఆలోచన నియంతృత్వానికి దారితీస్తుందని ఆయన అన్నారు.

బీఆర్ఎస్ గూండాగిరి తీరు ఖండనీయం

తెలంగాణ భవన్ వద్ద ఏబీఎన్ సిబ్బందిపై జరిగిన దాడి గూండాగిరి తప్ప మరొకటి కాదని చుంచు కుమార్ తీవ్రంగా విమర్శించారు. కవరేజ్ కోసం వెళ్లిన కెమెరామెన్ పవన్‌పై దాడి చేయడం ద్వారా మీడియాను భయపెట్టాలన్న ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని, నాలుగవ స్తంభాన్ని కూల్చే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన తేల్చి చెప్పారు.

జర్నలిస్టులపై దాడులు కొనసాగితే అఖిల భారతీయ జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో జర్నలిస్టులంతా ఐక్యంగా ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

జర్నలిస్టులపై దాడి అంటే ప్రజలపై దాడే

జర్నలిస్టులపై దాడి అంటే ఒక్క మీడియా సంస్థపై దాడి కాదని, ప్రజలకు నిజం తెలిసే హక్కును కాలరాయడమేనని చుంచు కుమార్ పేర్కొన్నారు. నిజాన్ని దాచగలిగితే ప్రజలను మోసం చేయవచ్చన్న భావనతో జరుగుతున్న ఈ దాడులు ప్రజాస్వామ్యానికి పెను ముప్పుగా మారుతున్నాయని హెచ్చరించారు. వేమన చెప్పినట్లుగా నిజం పలికిన నోరు ఎప్పుడూ నిలిచిపోతుందని, శ్రీశ్రీ ఊపిరిలా తిరుగుబాటు స్వరమే సమాజాన్ని ముందుకు నడిపిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

కలమే ఆయుధం -- కలమే శక్తి

ఈ ఘటనను ఒక పార్టీకి లేదా ఒక ప్రాంతానికి పరిమితం చేసి చూడరాదని చుంచు కుమార్ స్పష్టం చేశారు. ఇది రేపు ఏ జర్నలిస్టుకైనా, ఏ మీడియా సంస్థకైనా జరగవచ్చని, అందుకే జర్నలిస్టులంతా ఐక్యంగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సమాజాన్ని నిర్మించేది కలమేనని, అన్యాయాన్ని ప్రశ్నించేది కూడా కలమేనని ఆయన అన్నారు. కలాన్ని బంధించాలనుకునే శక్తులకు కలం శక్తి ఏమిటో మరోసారి చాటి చెబుతామని హెచ్చరించారు. జర్నలిస్టులపై దాడులు చేస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు జర్నలిస్టులు వెనకడుగు వేయరని, అవసరమైతే కలంతోనే ఉద్యమాన్ని రగిలిస్తామని చుంచు కుమార్ స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలిచే కలం ఎప్పటికీ మౌనంగా ఉండదని, అదే ప్రజాస్వామ్యానికి అసలైన ప్రాణమని ఆయన తేల్చి చెప్పారు.

# తూతూ మంత్రంగా నూతన కార్యవర్గం ఎన్నిక

ఉప్పల్, ఫిబ్రవరి 01 (నవతరం): ఉప్పల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నికలు కేవలం తూతూ మంత్రంగా నిర్వహించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నచ్చిన వ్యక్తులకు ఉన్నత పదవులు, మరికొందరికి డీ పోస్టులు కేటాయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హత లేని వారికి కూడా కీలక పదవులు అప్పగించడంపై పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక మరోవైపు, సభ్యులుగా ఎన్నికైన వారి పేర్లు స్పష్టంగా పేర్కొనకుండా పత్రిక ప్రకటన విడుదల చేయడం అనుమానాలకు తావిస్తోంది. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా లేకపోవడంతో పాటు, ముందే నిర్ణయించినట్లుగా గనకరం చేసినట్టు ఈ ఎన్నికలు జరిగాయనే ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఉప్పల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన పలువురు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఎన్నికల తీరుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.




పారదర్శకత లేకుండా జరిగిన ఎన్నికలు సంస్థ విశ్వసనీయతను దెబ్బతీసే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

# ఊరంతా ఖాళీ...

**శతాబ్దాల ఆచారం**
**గ్రామ సుభిక్షతం కోసం ఆచారం అమలు**

**తాడిపత్రి మండలం తలారి చెరువు**

తాడిపత్రి,
మాఘ పౌర్ణమి వచ్చిందంటే చాలు ఆ గ్రామం ఖాళీ అవుతుంది. 24 గంటల పాటు ఆ గ్రామ వీధుల్లో మనుషులే కాదు పిల్లి, కుక్క, చివరకు కోడి కూడా కనిపించవు. దాదాపు నాలుగు శతాబ్దాల పాటు వస్తున్న ఆచారాన్ని ఎంతో పవిత్రంగా తలాచెరువు గ్రామ ప్రజలు ఆచరించడం విశేషం. ఆదివారం ఆచారాన్ని ఆ గ్రామస్తులు ఆచరించారు.
తాడిపత్రి మండలం లోని తలారి చెరువు కు సుదీర్ఘ చరిత్ర ఉంది. పట్టణానికి 10 కిలోమీటర్లు ఉన్న ఈ గ్రామంలో పూర్వీకులు ఆచార, వ్యవహారాలను నేటికీ పాటిస్తుండడం విశేషము .ఇందులో భాగంగా ఏటా మాఘ పౌర్ణమి నాడు గ్రామస్తులు తట్టా ,బుట్టా సర్దుకుని పిల్లా , జల్లా పశు, పక్షి లతో 24



గంటలపాటు గ్రామాన్ని విడిచి వెళ్లారు. ఈ ఆచారాన్ని గ్రామస్తులు అగ్గిపాడు అని పిలుస్తుంటారు.
లిగ్రామం సుభిక్షితంగా ఉండాలని...
అగ్గిపాడు ఆచారాన్ని క్రమం తప్పకుండా నిర్వహించడం వెనక ఒక కథను స్థానికులు నేటికీ విశ్వసిస్తున్నారు. దాదాపు నాలుగు వందల సంవత్సరాల క్రితం వర్షాలు కురవక తలారి చెరువు గ్రామంలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాభివృద్ధి కుంటుపడింది. ఆకలి బాధ తాళలేక గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు .దీంతో భయాందోళనకు గురైన స్థానికులు గ్రామ సమీపంలోని దర్గాలో



స్వామీజీని కలిసి సమస్యలను విన్నవించుకున్నారు. శాప ప్రభావంతో గ్రామానికి అరిష్టం దాపరించిందని, అది తొలిగిపోవాలంటే ప్రతి ఏటా మాఘ పౌర్ణమి నాడు గ్రామాన్ని ఖాళీ చేసి ఉండాలని స్వామి సూచించారు. అప్పటినుంచి ఆ గ్రామస్తులు ఆచారాన్ని పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం గ్రామస్తులు అగ్గిపాడు ఆచారాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున గ్రామాన్ని విడిచి హాజీవులి దర్గా వద్దకు చేరుకొని అక్కడే వంటా, వార్పుతో ఆటపాటలతో సరదాగా గడిపారు. అర్ధరాత్రి దాటిన తర్వాత గ్రామానికి చేరుకున్నారు.

## : ధర్నాకు దిగిన బీఆర్ఎస్ నాయకులు



హైదరాబాద్, నవతరం: విచారణ పేరుతో తెలంగాణ రాష్ట్ర సాధకుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను సాయంత్రం ఆరు గంటల తరువాత కూడా నిబంధనలకు విరుద్ధంగా సిట్ అధికారులు విచారించడం, తెలంగాణ శ్రేణులను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ భవన్ ఎదుట ధర్నాకు దిగారు కూకట్పల్లి ఏమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని ఎక్కడిక్కడ పోలీసులతో తెలంగాణ ప్రజలను అణచివేసే ప్రయత్నం జరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## అంబటి రాంబాబు అది నోరా డ్రైనేజానా

**మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలను ఖండించిన మాజీ ఎంపీపీ విధ్యా ధరణి,తెలుగు మహిళలు**



గోరంట్ల,
ఒక మాజీ మంత్రి అయి ఉండి నీకు వయసు పెరిగింది కానీ, బుద్ధి మాత్రం పెరగలేదు, ఇంకా అధికారం లోనే ఉన్నామని భ్రమలో మాట్లాడుతున్నారు.వెంటనే మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి బహిరంగ క్షమాపణ చెప్పాలని, సభ్య సమాజం తలదించుకునేలా మీ వ్యాఖ్యలు ఉన్నాయనీ మాజీ ఎంపీపీ నిమ్మల విద్య ధరణి తెలిపారు,మహిళల పట్ల మీకు మీ పార్టీ కి ఉన్న గౌరవం ఏ పాటిదో ఈ సంఘటనను బట్టిఅర్థం అవుతోంది యావత్ మహిళా సమాజం ఛీ కొడుతోంది రాంబాబు, మా నాయకునికి మహిళా సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని లేకుంటే రానున్న రోజుల్లో యావత్ మహిళా సమాజాన్ని ఏకం చేసి తగిన బుద్ధి చెబుతామని మహిళలందరూ హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి తో పాటు మాజీ వార్డ్ మెంబెర్ అది లక్ష్మి,నాగమణి, గంగ రత్న బాయ్ తదితర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పీజీ హాస్టల్‌లో ల్యాప్‌టాప్ చోరీల గుట్టురట్టు



కుత్బుల్లాపూర్, నవతరం: దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బహదూర్‌పల్లి ప్రాంతంలో పీజీ హాస్టళ్లను లక్ష్యంగా చేసుకుని జరిగిన వరుస ల్యాప్‌టాప్ దొంగతనాల కేసును ఛేదించినట్లు దుండిగల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, మొత్తం ఏడు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. బహదూర్‌పల్లి లోని ఓ పీజీ హాస్టల్‌లో జనవరి 24వ తేదీ తెల్లవారుజామున చోరీ జరగగా, రెండు ల్యాప్‌టాప్‌లు అపహరణకు గురయ్యాయి. అదే ప్రాంతంలో జనవరి 26వ తేదీ తెల్లవారుజామున మరోసారి పీజీ హాస్టల్‌లోని వివిధ గదుల నుంచి మొత్తం ఏడు ల్యాప్‌టాప్‌లు దొంగిలించబడ్డాయి. ఈ ఘటనలపై దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. దర్యాప్తులో భాగంగా, దుండిగల్ పోలీస్ స్టేషన్ క్రైం టీం ఆదివారం నాడు సాయంత్రం 7 గంటల సమయంలో బహదూర్‌పల్లి ఎక్స్‌రోడ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతడే చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, రిసీవర్ వద్ద నుంచి ఐదు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా గంగనమోని అన్వేష్ కుమార్ (20)ను, రిసీవర్‌గా మయూర్ అశోల్ మేవాడా (46)ను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌ల మొత్తం విలువ సుమారు రూ. 3.50 లక్షలు ఉంటుందని తెలిపారు.

## తూతూ మంత్రంగా నూతన కార్యవర్గం ఎన్నిక



ఉప్పల్, ఫిబ్రవరి 01 (నవతరం): ఉప్పల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నికలు కేవలం తూతూ మంత్రంగా నిర్వహించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నచ్చిన వ్యక్తులకు ఉన్నత పదవులు, మరికొందరికి డీ పోస్టులు కేటాయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హత లేని వారికి కూడా కీలక పదవులు అప్పగించడంపై పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక మరోవైపు, సభ్యులుగా ఎన్నికైన వారి పేర్లు స్పష్టంగా పేర్కొనకుండా పత్రిక ప్రకటన విడుదల చేయడం అనుమానాలకు తావిస్తోంది. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా లేకపోవడంతో పాటు, ముందే నిర్ణయించినట్లుగా గనకరం చేసినట్టు ఈ ఎన్నికలు జరిగాయనే ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఉప్పల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన పలువురు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఎన్నికల తీరుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పారదర్శకత లేకుండా జరిగిన ఎన్నికలు సంస్థ విశ్వసనీయతను దెబ్బతీసే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

## సిరివరం గ్రామంలో కోడి రంగనాథ స్వామి బ్రహ్మరథోత్సవం ఘనంగా నిర్వహణ



లేపాక్షి,
లేపాక్షి మండలం సిరివరం గ్రామంలో శ్రీ కోడి రంగనాథ స్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం భక్తుల నడుమ వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, అనంతరం బ్రహ్మరథోత్సవం ఘనంగా కొనసాగింది.
ఈ సందర్భంగా నిర్వహించిన గురవయ్యల నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయ వాద్యాల మధ్య సాగిన ఈ నృత్య ప్రదర్శన ఉత్సవానికి ప్రత్యేక శోభను చేకూర్చింది. అలాగే తోలుబొమ్మలాట ప్రదర్శన గ్రామీణ కళా వైభవాన్ని ప్రతిబింబిస్తూ చిన్నారులతో పాటు పెద్దలను కూడా అలరించింది.
అదే విధంగా డప్పు కళాకారుల బృందం చేసిన నృత్యాలు, వాద్య ప్రదర్శనలు ఉత్సవ వాతావరణాన్ని ఉగ్రూతలూగించాయి. డప్పు మోగింపులతో గ్రామమంతా భక్తి ఉత్సాహంతో నిండిపోయింది. బ్రహ్మరథోత్సవాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.
ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, వాలంటీర్లు భద్రతా చర్యలు చేపట్టారు.

## ప్రచార కార్యక్రమాలపై చర్చించిన బీజేపీ నాయకులు





హైదరాబాద్, నవతరం: తెలంగాణలో మున్సిపల్ ః కార్పొరేషన్ ఎన్నికల దృష్ట్యా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో, రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు అధ్యక్షతన, రాష్ట్ర పదాధికారులు, వివిధ మోర్చాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ మున్సిపల్ ః కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి విజయమే లక్ష్యంగా, అనుసరించాల్సిన వ్యూహాలు, విధివిధానాలు, ప్రచార కార్యక్రమాలపై చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, మహారాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ మంత్రి మరియు తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్ ఆశిష్ శెలర్, రాజస్థాన్ బిజెపి మాజీ అధ్యక్షులు మరియు మున్సిపల్ ఎన్నికల కో-ఇన్‌చార్జ్ అశోక్ పర్ణామి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు తూళ్ళ వీరేందర్ గౌడ్, వేముల అశోక్, డా.ఎన్.గౌతమ్ రావు, తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేముల ప్రతాప్ గౌడ్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా






అశ్వారావుపేట, నవతరం: అశ్వారావుపేట మున్సిపాలిటీకి చెందిన నాయకులు వేముల ప్రతాప్ గౌడ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు, మాజీ ట్రైకర్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ప్రతాప్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి,
ఆయన ఆరోగ్య పరిస్థితినీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో ఉన్న ప్రతాప్ గౌడ్ తో మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు ఫోన్ ద్వారా మాట్లాడి ధైర్యం చెప్పారు. ఆయన త్వరగా కోలుకోవాలని, మళ్ళీ సంపూర్ణ ఆరోగ్యంతో రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు,మండల నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.

# చరణ్ Vs అఖిల్! తగ్గేదెవరు.. వచ్చేదెవరు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ డైరెక్టర్ బుచ్చిబాబు సానా కాంబోలో వస్తున్న పెద్ది (ప్రావసఃఇ) చిత్రం ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా గ్రామీణ నేపథ్యంలో ఈ స్పోర్ట్స్ డ్రామా రూపుదిద్దుకుంటోంది. ఒక సామాన్య యువకుడు క్రీడల్లో రాణిస్తూ తన గమ్యాన్ని ఎలా ముద్దాడాడనే స్ఫూర్తిదాయకమైన కథాంశంతో బుచ్చిబాబు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహామాన్ సంగీతం అందిస్తుండగా.. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్‌తో పాటు విలక్షణ నటుడు జగపతి బాబు, దివ్యేందు శర్మలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఈ క్రేజీ ప్రాజెక్ట్ షూటింగ్ దశలోనే ఉన్నప్పుడే మేకర్స్ విడుదల తేదీపై స్పష్టత ఇచ్చారు. మార్చి 27వ తేదీన రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకురావడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. అభిమానులకు ఇది ఒక గొప్ప కానుకగా ఉంటుందని అందరూ ఆశించారు. అయితే, మార్చి 27న పెద్ది విడుదల కావడం కష్టంగా తెలుస్తోంది. కానీ ప్రస్తుతం షూటింగ్ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో అనుకున్న సమయానికి థియేటర్లలోకి రావడం కష్టంగా కనిపిస్తోంది. సాంకేతిక కారణాల వల్ల సినిమా విడుదల వాయిదా వేయక తప్పని పరిస్థితి ఏర్పడిందట. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాను మే 1వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయడానికి మేకర్స్ సిద్ధమైనట్లు తెలుస్తోంది.

## ట్రైలర్ ఏంటి ఈరేంజ్‌లో ఉంది!

### ప్యాంట్లు.. తడుపుకోవడం గ్యారంటీ



ఓవీన్ చంద్ర , దివ్యా పిళ్లై , రాజా రవీంద్ర కీలక పాత్రల్లో తెరకెక్కిన సైకలాజికల్ హర్రర్ థ్రిల్లర్ చిత్రం హనీ పలాస, మట్కా సినిమాల ఫేం కరుణ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్లకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా ఈ చిత్రం ట్రైలర్ విడుదల చేశారు.

ఈ ట్రైలర్ చూస్తుంటే.. గతంలో వచ్చిన పిండం, ఇషా సినిమాలను తలదన్నేలా విభిన్న కాన్సెప్ట్‌తో రూపొందించినట్లు అర్థమవుతోంది. ఓ అరుదైన పిల్లి కోసం వెతకడం, అది వచ్చాక భయంకర ఘటనలు జరగడం ఇత్యాది సన్నివేశాలతో ఆద్యంతం ఆసక్తికరంగా ట్రైలర్ కట్ చేశారు. చూస్తుంటే సినిమాలో మ్యాటర్ గట్టిగానే ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. మూఢనమ్మకాలు నేపథ్యంలో గ్రిప్పింగ్ థ్రిల్లర్‌గా తెరకెక్కించారు.

## ఇక్కడ.. నాకు ఆ కష్టాలు తప్పలేదు

ఆమె కళ్లు మాట్లాడతాయి. ఆమె చిరునవ్వు కోటి భావాలను పలికిస్తుంది. పుష్కర కాలం క్రితం విక్రమ్ 'నాన్న' సినిమాలో చిట్టి పాపగా మనందరి హృదయాలను కొల్లగొట్టిన ఆ చిన్నారి ఇప్పుడు గ్లోబల్ బాక్సాఫీసును షేక్ చేస్తోంది.

ఝుతీఝు ాూతీయిబఅ: ఇక్కడ.. నాకు ఆ కష్టాలు తప్పలేదు

ఆమె కళ్లు మాట్లాడతాయి. ఆమె చిరునవ్వు కోటి భావాలను పలికిస్తుంది. పుష్కర కాలం క్రితం విక్రమ్ 'నాన్న' సినిమాలో చిట్టి పాపగా మనందరి హృదయాలను కొల్లగొట్టిన ఆ చిన్నారి ఇప్పుడు గ్లోబల్ బాక్సాఫీసును షేక్ చేస్తోంది. రణ్‌వీర్‌సింగ్ సరసన 'ధురంధర్'లో (ఇష్ట్రబతీఝుఅఎష్ఠుతీ) యలినాగా మెప్పించి.. ఇప్పుడు తెలుగులో 'యూఫోరియా'(జుబజూష్ట్రశీతీఱ ఖ)తో పలకరించబోతున్న సారా అర్జున్ (ఝుతీఝు ాూతీయిబఅ) సినీ ప్రస్థానం ఇది.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ధురంధర్ సృష్టిస్తున్న ప్రభంజనం అంతా ఇంతా కాదు. రూ. 1,300 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ స్పై థ్రిల్లర్‌లో సారా నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. 'జీవితంలో ప్రతి ఒక్కరికీ ఒక యూఫోరిక్ (అత్యంత ఆనందకరమైన) క్షణం ఒకటి ఉంటుంది. నాకు మాత్రం ధురంధర్ సినిమా చూసి అమ్మానాన్నలు కన్నీరు పెట్టుకున్న రోజు అది. నేను చదువులో టాపర్‌గా వచ్చినప్పుడు కూడా వారు అంతలా ఎమోషనల్ కాలేదు. నావల్ల వారు గర్వంగా ఫీలవడం నా కెరీర్‌లో బిగ్గెస్ట్ అచీవ్‌మెంట్" అని చెప్పుకొచ్చింది సారా.

వారసత్వం ఉన్నా తప్పని ఆడిషన్..

సారా తండ్రి రాజ్ అర్జున్ విలక్షణ నటుడిగా పేరు తెచ్చుకున్నా, ఆమెకు అవకాశాలు వెతుక్కుంటూ రాలేదు. రణ్‌వీర్‌సింగ్ వంటి స్టార్ సరసన నటించే అవకాశం కోసం ఆరు రౌండ్ల కఠినమైన ఆడిషన్ ఎదుర్కోవాల్సి వచ్చింది. క్యాస్టింగ్ డైరెక్టర్ ముకేశ్ ఛాబ్రా వద్ద తాను ఏ సినిమాకు ఆడిషన్ ఇస్తుందో కూడా తెలియకుండానే పెర్ఫార్మ్ చేసి ఈ పాత్రను దక్కించుకుంది. స్టార్ కిడ్ అయినప్పటికీ ప్రతిభను నిరూపించుకుంటేనే అవకాశాలు వస్తాయని సారా నమ్ముతుంది.



## కవల పిల్లలపై.. రామ్‌చరణ్ రియాక్షన్!

రామ్‌చరణ్ ఉపాసన (ఖజూఖయిఅఖ) దంపతులు కవల పిల్లలకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే! జనవరి 31వ తేది రాత్రి ఉపాసన ఓ బాబు, పాపకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అలాగే ఆదివారం ఉదయం మీడియా ముందుకొచ్చి తెలిపారు. తాజాగా ఇదే విషయంపై రామ్‌చరణ్ స్పందించారు. సోషల్ మీడియాలో ఆయన పోస్ట్ చేశారు. 'మా జీవితంలో మరో మధుర క్షణాన్ని మీతో పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. మాకు ఒక బాబు, ఒక పాప జన్మించారు. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలగడంతో ఎంతో ఆనందంగా ఉంది. మన జీవితంలో మహిళలే గొప్ప బలం. మాకు సంబంధించిన అన్ని విషయాల్లో మా వెంట నిలబడి అండగా ఉన్న అభిమానులకు, కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు. మీ ప్రేమ, ఆశీస్సులు మాకు ఎల్లప్పుడూ శక్తినిస్తాయి' అని పేర్కొన్నారు.





## ధనుస్‌తో.. శ్రీలీల రోమాన్స్!

టాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా గుర్తింపు పొందింది బాలీవుడ్ సినిమాల్లోనూ అవకాశం అందుకుంది. 'పరాశక్తి'తో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టింది.

టాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా గుర్తింపు పొందింది శ్రీలీల (ూతీవవశ్రీవవశ్రీఝ). బాలీవుడ్ సినిమాల్లోనూ అవకాశం అందుకుంది. 'పరాశక్తి'తో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. అయితే మరో తమిళ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కొంత కాలంగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చింది. -ధనుష్ ప్రధాన పాత్రలో రాజ్‌కుమార్ పెరియసామి ఓ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన హీరోగా నటిస్తున్న 55వ చిత్రమిది. 'డీ 55' (ఐ55) వర్కింగ్ టైటిల్ తో రూపొందుతున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తుంది. ఈ విషయాన్ని తెలుపుతూ.. శనివారం ఇన్‌స్టా వేదికగా కొన్ని ఫొటోలను పంచుకుంది చిత్ర బృందం. శ్రీలీల తమిళంలో నటించిన 'పరాశక్తి' ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఇప్పుడు ఈ సినిమాపై ఆమె బాగా హోప్స్ పెట్టుకుంది. ఈసారైనా విజయం వరిస్తుందేమో చూడాలి. అయితే.. రెండు రోజుల క్రితం వరకు కూడా ఈ చిత్రంలో సాయి పల్లవి కథానాయికగా నటించనున్నట్లు బాగా ప్రచారం జరిగింది. అలాంటిది సడన్‌గా సాయి పల్లవి స్థానంలో శ్రీలీల ఎంట్రీ ఇవ్వడం అందరినీ షాక్‌కు గురి చేసింది

## రాజమౌళి.. రివర్స్ ప్లాన్!




తెలుగు సినిమా స్థాయిని ప్రపంచ పటంపై నిలబెట్టిన దర్శకుడు రాజమౌళి (ూ ాఝయిఎశీబశ్రీఱ). ఆయన నుంచి సినిమా వస్తోందంటే అది కేవలం వినోదం మాత్రమే కాదు, ఒక అద్భుతమైన విజువల్ వండర్. సినిమాను తెరకెక్కించడం ఒక ఎత్తు అయితే, దాన్ని జనాల్లోకి తీసుకెళ్లడం మరో ఎత్తు. ఈ విషయంలో జక్కన్నను మించిన వారు లేరనే చెప్పాలి. ప్రస్తుతం పాన్ ఇండియా వైడ్‌గా స్టార్ దర్శకులంతా ఆయన పబ్లిసిటీ స్ట్రాటజీనే ఫాలో అవుతున్నారు. తాజాగా సూపర్ స్టార్ మహేష్ బాబుతో చేస్తున్న వారణాసి విషయంలో కూడా రాజమౌళి తన మార్క్ మేజిక్ చూపిస్తున్నారు .సాధారణంగా రాజమౌళి సినిమా అంటే ఏళ్ల తరబడి షూటింగ్ జరుగుతూనే ఉంటుంది. కానీ ఈసారి అందరికీ షాక్ ఇస్తూ, సినిమా సెట్స్‌పైకి వెళ్లకముందే ప్రీ-ప్రొడక్షన్ కోసం ఆరు నెలలకు పైగా సమయం కేటాయించారు. ఒక పక్క కథపై రకరకాల ఊహాగానాలు వస్తుంటే.. ఒక్క చిన్న గ్లింప్స్‌తో సినిమా స్పాన్ ఏంటో చూపించి అందరి నోళ్లు మూయించారు. కథను ముందుగానే చెప్పి ప్రేక్షకులను ప్రిపేర్ చేయడం ఆయన శైలి. అయితే వారణాసి విషయంలో మాత్రం రహస్యాన్ని మెయింటైన్ చేస్తూనే, హైప్ క్రియేట్ చేయడంలో సక్సెస్ అయ్యారు.భారీ విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ ఉన్న ఈ సినిమా పూర్తి కావడానికి కనీసం మూడు నాలుగేళ్లు పడుతుందని అంతా భావించారు

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com